
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 28 మార్చి 2025

మందకొడిగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ

మొరాయించిన సర్వర్



భూక్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) నమోదుకు దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నా ఈ నెల 30న ఉగాది, 31 రంజాన్ సెలవులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆన్‌లైన్ ప్రక్రియకు లబ్ధిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీల పరిధిలో లబ్ధిదారులు ఆన్‌లైన్ నమోదులో ఇబ్బందులుపడ్డారు. ఉద యం నుంచి సర్వర్ మొరాయించడంతో ప్రక్రియ నెమ్మదించింది. యాదగిరిగుట్టలో ఐదుగురికి మించి ఫీజు చెల్లించలేకపోయారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 33వేల మందికి పైగా ప్రభుత్వం అవకాశం ఇచ్చినా 1,862 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఇక్కడ లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారంటున్నారు. వెరసి ఉమ్మడి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడటౌన్, దేవరకొండ)


6

పట్టణ, గ్రామీణ మహిళా సంఘాలు

ఒకే గొడుగు కిందికి..

- సెర్ప్‌లో మెప్మా విలీనం
- ఉమ్మడి జిల్లాలో 19 మునిసిపాలిటీల్లో 15,559 మహిళా సంఘాలు

7



పట్టణ, గ్రామీణ మహిళా సంఘాలు ఒకే గొడుగు కిందికి చేరాయి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి మిషన్-2025లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ను, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేస్తూ ఈనెల 23న ప్రభుత్వం జీవో 15ను జారీ చేసింది.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)



పండుగకు

సన్నబియ్యం

- పేదలకు నాణ్యమైన బియ్యం అందేలా రేషన్ అక్రమాలకు చెక్‌పెట్టేలా..
- రాష్ట్రస్థాయిపథకాన్ని హుజూర్‌నగర్‌లో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లాలో సన్నబియ్యం కోసం రూ.857.76 కోట్ల వ్యయం
- కొత్తకార్డులకూ ఏప్రిల్ నుంచి సన్న బియ్యం ఇస్తామన్న మంత్రి ఉత్తమ్
- భారీ వ్యయంతో ఇస్తోన్న సన్నబియ్యాన్ని ప్రజలు దుర్వినియోగం చేయవద్దు : పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

దేశానికే తలమానికమవుతుందని భావిస్తోన్న కీలక పథకం ఈ నెల 30న ఉగాది రోజున హుజూర్‌నగర్ నుంచి ప్రారంభం కాబోతోంది. రేషన్‌కార్డులున్న లబ్ధిదారులందరికీ ఆ రోజు నుంచి సన్నబియ్యాన్నే రేషన్ కింద అందించే ఈ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో ప్రారంభించబోతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

జిల్లా	రేషన్‌కార్డులు	యూనిట్లు	నెలవారీ కోటా (మెట్రిక్‌టన్నుల్లో)
నల్లగొండ	4,66,522	13,85,506	8,878
సూర్యాపేట	3,05,564	8,79,000	4,750
యాదాద్రి	2,17,072	6,64,043	4,241
మొత్తం	9,89,158	29,28,549	17,869

సన్న బియ్యం పథకం అమలుకు ఏడాదికి రాష్ట్ర స్థాయిలో రూ.8వేల కోట్ల వరకు భారీగా వ్యయమవుతుందని అధికారులు అంచనావేశారు. అయినా పేదలకు ఆహారభద్రత కింద నాణ్యమైన బియ్యం ఇవ్వాలనే ధృడసంకల్పంతో ప్రభుత్వం ముందుకొచ్చింది. రేషన్ కింద సన్నబియ్యం ఇవ్వడం ద్వారా పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందడంతోపాటు, ప్రస్తుతం కొనసాగుతున్న రేషన్‌బియ్యం అక్రమదందా పూర్తిగా నిలిచిపోతుందని స్వయంగా మంత్రులు ఆశాభావం వ్యక్తం చేస్తుండడం ఈపథకం విజయవంతం కావడంపై ప్రభుత్వం పెట్టుకున్న ఆశల్ని తెలియజేస్తోంది. ఈ పథకాన్ని పకడ్బందీ అమలు చేయడంకోసం ఇప్పటికే అన్నివిధాల సన్నాహాలు పూర్తిచేసిన ప్రభుత్వం లోపాలు తలెత్తకుండా, పథకం ప్రారంభమయ్యాక మళ్లీ ఆగకుండా అవసరమైనంత మేర బియ్యాన్ని సైతం అందుబాటులో ఉంచింది.



ఉమ్మడి జిల్లాకు ఏడాదికి రూ.857.70 కోట్లు

ఏప్రిల్ నుంచి రేషన్‌కార్డులున్న ప్రతీ కుటుంబానికీ సన్నబియ్యమే ఉచితంగా అందుతుంది. ప్రతీ లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 29,28,549 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ప్రతినెలా ఆరు కిలోల చొప్పున సమీప రేషన్ దుకాణాల నుంచి సన్నబియ్యం అందుతుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్లకు అవసరమైన బియ్యాన్ని చేరవేశారు. వానాకాలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్న సన్న ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లులకు ఇచ్చి అందులో దాదాపు సగం బియ్యాన్ని ఇప్పటికే జిల్లా స్థాయి గోదాములకు చేరవేయగా, ఏప్రిల్ కోటాకు సంబంధించి ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్లకు, అక్కడి నుంచి రేషన్‌దుకాణాలకు సన్న బియ్యం సరఫరా...

మిగతా 7వ పేజీలో...

నల్లగొండ డీఐఈవోపై

విచారణ చేపట్టాలి

ఇంటర్ విద్యాకార్యదర్శి, కలెక్టర్‌కు వినతి

నల్లగొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి దస్రు నాయక్‌పై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి వి.శేఖర్ డిమాండ్ చేశారు. నల్లగొండ కలెక్టర్‌కు, ఇంటర్ విద్యశాఖ కార్యదర్శికి గురువారం ఆయన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసే క్రమంలో పలువురు కాంట్రాక్ట్ లెక్చరర్లు తప్పుడు సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన విషయాన్ని తాము ఇంటర్‌బోర్డుకి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత లెక్చరర్ల పత్రాలను పరిశీలించి నివేదించాలని జిల్లా ఇంటర్‌బోర్డు విద్యాధికారిని ఆదేశించారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు సమర్పించిన తప్పుడు సర్టిఫికెట్లను తాము ఆర్టీఐ ద్వారా సేకరించామని పేర్కొన్నారు.

ఆ సమాచారాన్ని కూడా ఇంటర్‌బోర్డు, సీబీసీఐడీకి అందజేయగా, ఈ విచారణ పూర్తయ్యేంతవరకు సదరు లెక్చరర్ల వేతనాలు ఆపాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారికి, ఇంటర్‌బోర్డు రీజనల్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయినా డీఐఈవో ప్రిన్సిపాళ్లను ఒత్తిడికి గురిచేసి నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న లెక్చరర్లకు వేతనాలు అందజేసినట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన నల్లగొండ డీఐఈవోపై విచారణ జరపాలని, క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:34 (శుక్రవారం సాయంత్రం) సహర్: 4:51 (శనివారం ఉదయం)

వేతనాలు ఎందుకివ్వరు?

ఖాతాలో జమచేసినా ఇవ్వడం లేదు

కార్యదర్శిపై మల్టీపర్పస్ వర్కర్ల ఆగ్రహం



మండల కేంద్రంలో గ్రామపంచాయతీ బయట కూర్చొన్న కార్యదర్శిని జీతాల గురించి నిలదీస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

తిరుమలగిరి(సాగర్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): జీతాల కోసం గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఖాతాలో జమ చేసిన తమ వేతనాలను సకాలంలో ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సంఘటన గురువారం తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మల్టీపర్పస్ వర్కర్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో పారిశుధ్య నిర్వహణతో పాటు విద్యుత్, పన్నుల వసూలు తదితర పనులను నిర్వహిస్తున్న జీపీ వర్కర్లకు ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన రెండు నెలల వేతనాలను టీఎస్‌బీపాస్ ఖాతాలో జమచేసింది. దీంతో మల్టీపర్పస్ వర్కర్లు తమ పెండింగ్ వేతనాలను ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను కోరారు. దానికి ఆయన నిరాకరించడమే కాకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి వెళ్లిపోయి బయట కూర్చొన్నాడు. దీంతో ఆగ్రహించిన వర్కర్లు వేతనాల ఇవ్వాలని నిలదీశారు. దీంతో స్థానికులు కూడా పనిచేసిన కార్మికులకు వేతనాలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అనంతరం సదరు మల్టీపర్పస్ వర్కర్లు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవో భీక్షంరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన టీఎస్ బీపాస్ ఖాతాలో వేతనాలు జమ అయ్యాయని వెంటనే సంబంధిత వర్కర్ల ఖాతాల్లో జీతాలు జమ చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. గతంలో కూడా ఐదు నెలల పెండింగ్ వేతనాలను ఇవ్వకుండా వర్కర్లతో జీతాలు తీసుకున్నట్లు రిజిస్టర్‌లో సంతకాలు చేయించుకొని చాలా రోజుల వరకు ఇవ్వలేదని ఆరోపించారు. అంతేకాక కష్టపడి పనిచేసిన తమకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యా ర్థి దశ నుంచే ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి విద్యార్థులకు సూచించారు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని శ్రీరామనందతీర్థ ఇనిస్టిట్యూట్‌లో గురువారం నిర్వహించిన నిడమనూరు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కలెక్టర్ తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల జ్ఞానాన్ని పరిశీలించారు. గణితం, సైన్స్, సోషల్, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులపై వివిధ రకాల ప్రశ్నలను అడిగారు. సరైన సమాధానాలు చెప్పిన పిల్లలకు చాక్లెట్లను పంపిణీ చేశారు. ఆయా తరగతి గదుల్లో విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎండాకాలంలో విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో జంక్‌ఫుడ్ తినొద్దన్నారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ తక్కిన పరీక్షలను బాగా రాయాలని సూచిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

చిట్యాల: ప్రభుత్వ, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం రాత్రి చిట్యాల (పీహెచ్‌సీ) ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ, ఫార్మసీతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి ద్వారా అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య ఎంత? అందులో గర్భిణులు ఎంత మంది అని సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. కరెంటు సమస్య ఉందని సిబ్బంది చెప్పటంతో వెంటనే స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని కోరారు. కలెక్టర్ వెం ట వైద్యాధికారి డాక్టర్ సత్య నరేష్, డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఎంపీవో సత్యనారాయణ ఉన్నారు.

సెర్ప్ లక్ష్యాలను సాధించాలి

- జిల్లా సమాఖ్య భవనాలు పూర్తి చేయాలి
- ఐకేపీ కేంద్రాల బకాయి చెల్లింపులకు చర్యలు
- పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్




మాట్లాడుతున్న లోకేష్

భువనగిరి (కలెక్టరేట్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాలకు పెండింగ్ ఉన్న కమీషన్ చెల్లించేలా చర్యలు తీసుకొని, సెర్ప్ లక్ష్యాలను సాధించాలని పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నా రు. నవంబరు వరకు జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. సెర్ప్ కార్యక్రమాల ప్రగతి పనులపై సీఈవో దేవరాజన్ దివ్యతో కలిసి గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.హనుమంతరావు, అదనపు కలెక్టర్(రెవెన్యూ) జీ.వీరారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ మాట్లాడుతూ యాసంగి సీజన్ మార్కెటింగ్‌కోసం సెర్ప్ ఆధ్వర్యంలో ఐకేపీ ధాన్యం కొనుగో లు కేంద్రాలను ప్రస్తుతం 33శాతం ఉన్న కేం ద్రాలను 50శాతానికి పెంచాలన్నారు. ఆసక్తి గ ల మహిళా సంఘాలు రైస్ మిల్లుల ఏర్పాటు కు ప్రణాళికలు తయారు చేసి పంపాలన్నారు. పౌర సరఫరాల శాఖ, సెర్ప్ సమన్వయంతో భారత ఆహారసంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలలను మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి నిర్ణీత సమయంలో అందేలా చూడాలన్నా రు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటుకోసం ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందస్తుగా జిల్లా స్థాయిలో ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. పెట్రోలు బం కుల తనిఖీలలో లైసెన్సు రద్దు చేసిన వాటిని మహిళా సంఘాలకు కేటాయించాలని, ఇందిరా మహిళా శక్తి బజార్లలో ప్రజలకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టీ.నాగిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, జిల్లా విద్యాశాఖాధికారి కే. సత్యనారాయణ పాల్గొన్నారు.

పంటకు ఊపిరి

- వరద కాల్వకు నీటి విడుదల
- మాడ్గులపల్లి 72 కిలోమీటర్ల వరకు
- యుద్ధ ప్రాతిపదికన అధికారుల చర్యలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



వరద కాల్వకు నీరులేక జీవం కోల్పోతున్న పంటలకు ఊపిరిపోసింది. నాలుగు రోజులుగా నీరు వస్తుండటంతో చివరి దశలో ఉన్న పంటలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. 'ఆంధ్రజ్యోతి' మినీలో ఈ నెల 24న కదిలిస్తే 'కన్నీటి వరద' అనే శీర్షికన రైతుల కష్టాలను ప్రచురించింది. వరద కాల్వకు నీటి సరఫరా చేయడానికి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ (వ్యవసాయం)

6

పదో తరగతి ప్రశ్నపత్రం

లీక్ ఘటన హైకోర్టుకు

- అన్యాయంగా డీబార్ చేశారని విద్యార్థిని వినతి
- ఏప్రిల్ 7న కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు సూచన

7

పంచాంగం శుభ, అశుభాలకు దిక్సూచి



విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ కల్చరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): శుభ, అశుభాలకు పంచాగం దిక్సూచి అని తెలంగాణ దేవాలయ అర్చక, వైదిక బ్రాహ్మణ సంఘం, దూప, దీప నైవేద్య అర్చక సంఘాల రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు గుదె లక్ష్మీనర్సయ్యశర్మ, పోతులపాటి రామలింగేశ్వరశర్మ, దౌవలాతాబాద్ వాసుదేవశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవాదాయశాఖ కార్యాలయ ఆవరణలో గురువారం అర్చక, వైదిక బ్రాహ్మణ సంఘాల జిల్లా శాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో 2025- 2026 శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని మంతోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిథి,వారం, నక్షత్ర, తారాబలం తెలిపేదే పంచాంగమని, పంచాంగం ప్రకారంగా హిందువుల పండుగలు జరుగుతాయని పేర్కొన్నారు. పంచాంగం లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరని తెలిపారు. అనంతరం బ్రాహ్మణులందరికి నూతన సంవత్సర పంచాంగాలను అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు కె. వెంకటరమణశాస్త్రి, నాగోజు మల్లాచారి, రాంబాబుశర్మ, నర్సింహమూర్తి, శివప్రసాద్ శర్మ, హరీష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, రాకేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీ యూనివర్సిటీ ప్రాంగణంలో అగ్నిప్రమాదం

- 80ఎకరాల్లో వ్యాపించిన మంటలు
- రెండున్నర గంటల పాటు శ్రమించి మంటలు ఆర్పిన సిబ్బంది



ఎంజీ యూనివర్సిటీ వెనుక భాగంలో దగ్ధమవుతున్న చెట్లు, గడ్డి

నల్లగొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వెనుక భాగంలో గురువారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. యూనివర్సిటీ ప్రాంగణం పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో పత్తి కట్టెకు నిప్పు అంటించగా, గాలి వీచి యూనివర్సిటీ ప్రాంగణంలోని చెట్లు, గడ్డికి అంటుకున్నాయి. దీంతో యూనివర్సిటీ వెనుక భాగంలోని దాదాపు 80ఎకరాల పైచిలుకు ప్రాంతంలో వ్యాపించి అక్కడున్న గడ్డి, కంపచెట్లు, ఇతర చెట్లకు మంటలు అంటుకున్నాయి. మంటల వ్యాప్తిని గమనించిన యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది నల్లగొండ ఫైర్ స్టేషన్, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రాత్రి 8 గంటలకు రంగంలోకి దిగిన పోలీసులు మూడు ఫైరింజన్లను యూనివర్సిటీకి పంపారు. దాదాపు రెండున్నర గంటల పాటు ఫైరింజన్లు, సిబ్బంది శ్రమించి యూనివర్సిటీ ప్రాంగణంలో వ్యాపించిన మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సమయంలో యూనివర్సిటీ హాస్టళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలు అదుపులోకి వచ్చాయని, ఎలాంటి ఇబ్బంది లేదని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు.

మందకొడిగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ



మిర్యాలగూడలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తును స్వీకరిస్తున్న మునిసిపల్ అధికారులు

- పాతిక శాతం ఫీజు రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- క్రమబద్ధీకరణలో మొరాయిస్తున్న సర్వర్లు
- గడువు పెంచాలంటున్న దరఖాస్తుదారులు

భూక్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగడంలేదు. అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం 2020లో ప్లాట్లు, భూయజమానుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. 2020 ఆగస్టు 26 నాటికి వచ్చిన దరఖాస్తులకు మోక్షం కలిగించడంతో పాటు ఆదాయ పెంపుకోసం విధివిధానాలను సమూలంగా మార్చింది. ఈ క్రమంలో గత నెలలో అందుకు ప్రత్యేక మాడ్యూల్‌ను సిద్ధం చేసిన ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సైతం అప్పగించింది. అయితే ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ ప్రక్రియ మాత్రం నెమ్మదిగా సాగుతోంది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

భూముల క్రమబద్ధీకరించడంతో పాటు ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం యూజర్ మ్యాన్యువల్ ప్రీ రిజిస్ట్రేషన్ ఎల్‌ఆర్‌ఎస్-2020 పేరుతో వెబ్‌సైట్ రూపొందించింది. అంతేగాక క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకొచ్చిన దరఖాస్తుదారులకు వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) విధానం అమలుచేయడంతో పాటు నిర్ధారించిన ఫీజులో 25శాతం రాయితీ ప్రకటించింది. 'రిజిస్ట్రేషన్.తెలంగాణ.గవ్.ఇన్' పోర్టల్‌లో ఈ సర్వీసెస్ మెనూ కింద ఎల్‌ఆర్‌ఎస్ ప్రీ రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని పొందుపరిచింది. ఈ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవడంతో పాటు క్రమబద్ధీకరణకు అవసరమైన ఫీజు (రాయితీ పోను)చెల్లించే ఏర్పాటు చేసింది.

మూడంచెల విధానంలో..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ కోసం మూడంచెల(లెవల్-1, లెవల్-2,లెవల్-3) విధానాన్ని అమలుచేస్తోంది. క్రమబద్ధీకరణ ప్రక్రియ లెవల్-1 దగ్గరే బ్రెక్ పడుతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. 25శాతం ఫీజురాయితీ పొందేందుకు చివరి తేదీ ఈ నెల 31 కాగా చివరలో రెండు రోజులు ఉగాది, రంజాన్ పండుగలు రావడంతో దరఖాస్తులు పరిష్కారానికి నోచుకుంటాయో లేదోనన్న ఆందోళన నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో...

జిల్లా	మునిసిపాలిటీలు	దరఖాస్తు
నల్లగొండ	ఎనిమిది	72,642
యాదాద్రి	ఆరు	55,362
సూర్యాపేట	ఐదు	65,209

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులిలా

ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీలలో 1,93,213 దరఖాస్తులు వచ్చాయి. అయితే మొత్తంలో పరిష్కరించిన దరఖాస్తులు నేటికీ 50వేలు దాటలేదు. అధికారయంత్రాంగం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీపై ప్రచారం విస్తృతం చేయడంతో పాటు కరపత్రాలు, వాల్‌పోస్టర్లను సైతం ముద్రించింది.

మిర్యాలగూడ పరిధిలో...

మిర్యాలగూడలో 14,320 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రాగా 302 దరఖాస్తులు పరిష్కరించారు. మరో 576 దరఖాస్తులకు సరైనపత్రాలు లేవని గుర్తించారు. 33 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, 4,112 దరఖాస్తులు నిషేధిత స్థలాల్లో ఉన్నట్లు నిర్ధారించారు. మొత్తం 8,143 దరఖాస్తులు క్రమబద్ధీకరించేందుకు సిద్ధంగా ఉండగా వారందరికీ ఆటో జనరేటెడ్ మెసేజెస్ నేరుగా వెళ్లాయి. దీంతో దరఖాస్తుదారులు మునిసిపల్ కార్యాలయానికి బారులుదీరుతుండగా సర్వర్‌లు ససేమిరా అంటున్నాయి. ఈ నేపథ్యంలో ఫీజు రాయితీ గడువు పెంచాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ముందుకు వస్తున్న దరఖాస్తుదారులు

ఇంతకాలం స్తబ్ధుగా ఉన్న దరఖాస్తుదారు రాయితీ ప్రకటించడంతో ముందుకు వస్తున్నారు. క్రమబద్ధీకరణకు ముందు ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేయాల్సి ఉంటుంది. అయితే సమయం ఎక్కువగా లేకపోవడం, దరఖాస్తుదారులకు నేరుగా సంక్షిప్త సమాచారం అందడంతో ఫీజు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. ప్రక్రియ లెవల్-కు రాగానే నిలిచిపోతున్నాయి. ఎల్-1లో మూడు శాఖలుండగా ఎవరు ప్రాసెస్ చేసినా సదరు దరఖాస్తు మిగతా ఇద్దరికీ కనిపించాలి. కానీ కనిపించడం లేదు. దీంతో క్రమబద్ధీకరణ వేగంగా సాగడం లేదు.

అవగాహన లోపంతో అనాసక్తి

సూర్యాపేటటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఆర్‌ఎస్‌పై మునిసిపల్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించలేదు. దీంతో రాయితీని ఉపయోగించుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపునకు అంతగా ఆసక్తి చూపడం లేదు. సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలో 35,470 దరఖాస్తులు రాగా అందులో 1,862 మంది ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కింద చెల్లించడంతో ప్రభుత్వానికి రూ.9.45కోట్ల ఆదాయం వచ్చింది. పెండింగ్‌లో 33,608 దరఖాస్తులు ఉన్నాయి. అయితే నిరుపేదలు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించునేందుకు చదరపు గజానికి 14శాతం చొప్పున కట్టాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాస్త సమయం పెంచితే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ప్లాట్ల క్రమబద్ధీకరణకు యజమానులు ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి. అనుమతులు లేని ప్లాట్లలో ఇల్లు నిర్మించాలంటే మునిసిపాలిటీ నుంచి అనుమతులు పొందలేరు. ఒక వేళ దరఖాస్తు చేసుకున్నా అన్నిరకాల చార్జీలు వసూలు చేయాల్సి ఉంటుంది. దీంతో రూ.లక్షల్లో అనుమతుల కోసమే ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తుంది.

- శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ సూర్యాపేట

క్లియర్‌గా ఉన్న దరఖాస్తులకు ఇబ్బందుల్లేవు



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ సక్రమంగానే సాగుతోంది. ప్రభుత్వ, నిషేధిత భూముల్లోని వెంచర్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అదనపు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. నీటి పారుదల, రెవెన్యూ శాఖలు జారీ చేసిన నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌ఓసీ) అప్‌లోడ్ చేయడంలో సాంకేతిక సమస్య ఎదురవుతున్నట్లు పట్టణ ప్రణాళిక అధికారులు నా దృష్టికి తెచ్చారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఎండీ.యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

రెండు గంటలు మొరాయించిన సర్వర్...

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్/ యాదగిరిగుట్ట/ భువనగిరిటౌన్ /కోదాడ/ దేవరకొండ)

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ఫీజు చెల్లింపులకు గురువారం లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచే సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి మునిసిపల్ కార్యాలయాలకే పరిమితం కావాల్సి వచ్చింది. చౌటుప్పల్, భువనగిరి,కోదాడలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల పాటు సర్వర్ మొరాయించడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కొందరు వెనుదిగారు. ఇదే తరహా పరిస్థితి అన్ని ఆన్‌లైన్ సెంటర్లలో నెలకొనగా ఇంటి నుంచే ఫీజు చెల్లించాలని ప్రయత్నం చేసిన వారు కూడా ఇబ్బందికి గురయ్యారు.

● చౌటుప్పల్‌లో నాలుగు కంప్యూటర్ల ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు కొంత ఉపశమనం లభించింది. మునిసిపల్ కమిషనర్ కే నర్సింహారెడ్డి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. గురువారం ఉదయం 11 గంటల వరకు 1,403 మంది ప్రభుత్వానికి రూ.3 కోట్లను చెల్లించారు.

● యాదగిరిగుట్టలో సర్వర్ సమస్యతో ఐదారుగురు మాత్రమే ఫీజు చెల్లించారు. ఇప్పటివరకు 400 మంది దరఖాస్తులు ఫీజు చెల్లించడంతో రూ.కోటి ఆదాయం వచ్చింది. 400దరఖాస్తులు టౌన పరిధిలో లేనట్లుగా గుర్తించగా, 200 దరఖాస్తులు అస్పష్టంగా ఉన్నట్లు సమాచారం.

● భువనగిరిలో షార్ట్‌ఫాల్స్‌ను లాగిన్‌లో అప్‌లోడ్ చేయగా సకాలంలో ఎల్-1 రెవెన్యూ లాగిన్, ఎల్-2 ఇరిగేషన్ లాగిన్‌లో సంబంధిత అధికారులు క్లియరెన్స్ చేయకపోతుండగా మరోవైపు అన్నిక్లియరెన్స్‌లు ఉన్నవారు సర్వర్ బిజీతో ఫీజు చెల్లించలేకపోతున్నారు. మొత్తం 15,533 దరఖాస్తుల్లో 6,400దరఖాస్తులకు అనుమతి లభించగా ఇప్పటివరకు 1000 మంది ఫీజు చెల్లించారు. రూ.6.20 కోట్లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. గురువారం ఒక్కరోజే 80 మంది రూ.50 లక్షలు చెల్లించారు.




చౌటుప్పల్‌లో సర్వర్ బిజీని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి

● కోదాడలో 16వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 5 నుంచి 23వ తేదీ వరకు 400 మంది ఆన్‌లైన్ చేసుకోగా, నాలుగు రోజులుగా 300 మంది మొత్తంగా 700 మంది ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించారు. వీరి ద్వారా ప్రభుత్వానికి రూ.6.5 కోట్ల ఆదాయం సమకూరింది.

● దేవరకొండ మునిసిపాలిటీలో 5022 దరఖాస్తులు రాగా అందులో 3,422 మందికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 130 దరఖాస్తులకు రూ.18లక్షల వరకు ఫీజులు చెల్లించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ ఫీజు చెల్లింపునకు దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదు.

సమయం పొడిగించాలి



ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు మూడు నెలల పాటు గడువు పెంచాలి. పేద ప్రజలు ఒకేసారి వేల రూపాయలు చెల్లించాలంటే డబ్బుల్లేక ఇబ్బందులుపడుతున్నారు. గడువు దాటితే అదనంగా రూ.లక్షలు చెల్లించాలంటే మూలుగుతున్న నక్కపై తాటికాయ పడ్డ విధంగా అవుతోంది.

- గంగసాని రామారావు, యాదగిరిగుట్ట

బెంగళూరు బేకరీ సీజ్, జరిమానా



బేకరీని సీజ్ చేస్తున్న మునిసిపల్ అధికారి హనుమాన్‌ప్రసాద్

చౌటుప్పల్ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని తంగడపల్లి రోడ్డులోని బెంగళూరు బేకరీని సీజ్ చేయడంతో పాటు జరిమానా విధించినట్లు మునిసిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి తెలిపారు. కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరు బేకరీలో ప్లాస్టిక్ కవర్లను వాడటంతో పాటు గడువు ముగిసిన తినుబండారాలను విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అయితే పరిశీలించేందుకు బేకరీకి వెళ్లిన మునిసిపల్ అధికారులతో బేకరీ నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారని ఆయన తెలిపారు. బేకరీలో ప్లాస్టిక్ కవర్లను వాడకంతో పాటు గడువు ముగిసిన తినుబండారాలను గుర్తించారని వాటికి రూ.5 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ జరిమానాను చెల్లించేందుకు నిర్వాహకులు నిరాకరించడంతో పాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారని వీటిని పరిగణలోకి తీసుకొని బేకరీని సీజ్ చేశామని ఆయన వివరించారు. జరిమానా చెల్లించిన అనంతరం సీజ్‌ను తొలగించామని ఆయన తెలిపారు. సమావేశంలో మునిసిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్‌లో రెండు బైక్‌లు దగ్ధం



దగ్ధమైన వాహనాలు

ఆలేరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్‌బంక్‌లో రెండు బైక్‌లు దగ్ధమైన సంఘటన బుధవారం అర్ధరాత్రి యాదాద్రిభువనగిరి జిల్లా కొలనుపాకలో జరిగింది. స్థానిక గాయత్రి పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది తమ బైక్‌లను బంక్‌లోనే పార్క్ చేసి నిద్రపోతున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి అర్ధరాత్రి రెండు గంటల సమయంలో బైక్‌లకు నిప్పటించాడు. దీంతో పూర్తిగా కాలిపోయాయి. మరో బైక్ పాక్షికంగా కాలిపోయింది. 24 గంటల సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగే పెట్రోల్‌బంక్‌లో బైక్‌ల దహనం చేసిన సంఘటన చర్చనీయాంశమైంది. వాహనాలతో పాటు పెట్రోల్ బంక్‌కు మంటలు అంటుకుని ఉంటే ప్రమాదం జరిగిఉండేదని స్థానికులు పేర్కొన్నారు. అగ్నిమాపక యంత్రాల సహాయంతో మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయమై ఆలేరు పోలీసులుల కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన ముగ్గురికి ఏడాది జైలు

మాడ్గులపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించి, దాడి చేసిన ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ స్పెషల్ ఫర్ సెకండ్ ఏడీజే కోర్టు గురువారం తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన నకిరేకంటి శ్రీను, రజిత భార్యభర్తలు. వీరు 2020లో వారి పొలంలో వరికోత మిషన్‌తో వరి కోస్తుండగా అదే గ్రామానికి చెందిన బట్టు సైదిరెడ్డికి చెందిన పొలంలోకి కోతమిషన్ వెళ్లింది. దీంతో సైదిరెడ్డితో పాటు కుమారుడు మహేందర్‌రెడ్డి, భార్య లక్ష్మమ్మ కలిసి శ్రీనును కులం పేరుతో దూషించి దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో శ్రీను భార్య రజిత ఫిర్యాదుమేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేయడంతో మిర్యాలగూడ డీఎస్పీ వై.వెంకటేశ్వర్‌రావు విచారణ చేపట్టి నల్లగొండలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలుచేశారు. విచారణ అనంతరం ఒక్కొక్కరికి కులం పేరుతో దూషించినందుకుగాను ఆరు నెలలు, దాడి చేసినందుకు ఆరు నెలలు మొత్తం ఏడాది జైలు శిక్షతో పాటు రూ.3000 జరిమానా విధిస్తూ జడ్జి రోజారమణి గురువారం తీర్పునిచ్చారు.

జూదరుల అరెస్ట్

సూర్యాపేటక్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి ఎనిమిది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టుచేశారు. ఇందిరమ్మ కాలనీలో స్థానికులు బాబూరావు నివాసంలో పేకాడుతున్న సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు. దాడిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.25వేల నగదుతో పాటు ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

● డబ్బుల కోసం అమ్మతో గొడవపడి...

మిర్యాలగూడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసై డబ్బుల కోసం అమ్మతో గొడవపడి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్ ఎస్ఐ హరీ‌ష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ బంగారుగడ్డ కాలనీకి చెందిన గుంటోజు మధుబాబు(42)కు వివాహం కాగా తరుచూ భార్యతో గొడవపడుతుండేవాడు. దీంతో ఆమె భర్తను వదిలి వెళ్లి పోయింది. అప్పటి నుంచి తల్లి దండ్రులు వసంతరాయుడు, జయమ్మలతోనే కలిసి ఉంటున్నాడు. లారీడ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసై తరుచూ తాగుతుండటంతో డ్రైవర్ ఉద్యోగాన్ని నుంచి కొద్దికాలం క్రితం మధును తొలగించారు. అప్పటి నుంచి మద్యం తాగేందుకు డబ్బులు కావాలని రోజూ తల్లిని వేధిస్తున్నాడు. డబ్బులు తనవద్ద లేవని తల్లి చెప్పడంతో బుధవారం రాత్రి ఆస్తిలో తనవాటా ఇవ్వాలని గొడవకు దిగడంతో తల్లి జయమ్మ రాత్రి సమయంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా తల్లిని అనుసరిస్తూ స్టేషన్ వరకు వచ్చిన మధుబాబు మద్యం మత్తులోనే తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ స్టేషన్ ముందు రోడ్డుపైనే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ మూత తీసి ఒంటిపై పోసుకుని నిప్పటించుకున్నాడు. గమనించిన స్థానికులు, పోలీసులు మంటలను ఆర్పివేసి తీవ్రగాయాలైన అతడిని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నల్లగొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా గురువారం మృతి చెందినట్లు టూటౌన్ తెలిపారు. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు

సూర్యాపేట క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ వీరరాఘవులు, మృతురాలి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటలోని హెడ్‌పోస్టాఫీస్ సమీపంలో నివాసముంటున్న షేక్ ఖాసీం పెద్దకుమార్తె లాల్‌బీ(23) బ్యూటీపార్లర్ నిర్వహిస్తోంది. కాగా పట్టణానికి చెందిన శ్రీకాంత్‌తో 2021లో ప్రేమవివాహం చేసుకుంది. వారికి కుమారుడు ఉన్నారు. అయితే లాల్‌బీ భర్తతో జరిగిన గొడవల కారణంగా ఐదు నెలలుగా తండ్రి ఖాసీం నివాసంలో ఉంటోంది. అక్కడి నుండే తన బ్యూటీ పార్లర్‌కు వెళ్లి వస్తోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు బ్యూటీ పార్లర్‌కు వెళ్లి రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చింది. ఇంట్లో తండ్రి ఖాసీం, లాల్‌బీ కుమారుడు, ఇతరులు ఒక గదిలో పడుకున్నారు. లాల్‌బీ మాత్రం మరో గదిలో నిద్రించింది. గురువారం తెల్లవారుజామున మంచినీళ్ల కోసం నిద్రలేచిన ఖాసీంకు లాల్‌బీ ఉరేసుకుని కనిపించింది. ఈ విషయమై ఆయన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని మృతికి కారణాలపై విచారణ చేస్తున్నట్లు సీఐ వీరరాఘవులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి...

మాడ్గులపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ కృష్ణయ్య, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మాడ్గులపల్లి మండలం గండ్రవానిగూడెం గ్రామానికి చెందిన కంచర్ల లచ్చిరెడ్డి(50) కొన్ని నెలలుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. కొన్నిరోజుల క్రితం రాత్రి సమయంలో దేవతలబావిగూడెం వెళ్లడంతో కుటుంబసభ్యులు ఆరా తీసి ఇంటికి తీసుకొచ్చారు. బుధవారం మేకలను మేపుకుని ఇంటికి వచ్చిన తరువాత బయటకువెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్ద వెతికారు. బావి దగ్గర ఉన్న వేపచెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారని ఎస్ఐ తెలిపారు. లచ్చిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు సూర్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబసభ్యులకు అందించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

చివరి దశలో పంటకు ఊపిరి

- ● వరద కాల్వకు నీటి విడుదల
- ● మాడ్గులపల్లి నుంచి 72 కిలోమీటర్ వరకు
- ● యుద్ధ ప్రాతిపదికన అధికారుల చర్యలు
- ● ఆనందం వ్యక్తం చేస్తున్నరైతులు



వరదకాల్వకు నీటి రాకతో జీవం కోల్పోతున్న పంటలకు ఊపిరిపోసినట్లయ్యింది. నాలుగు రోజులుగా నీరు వస్తుండటంతో చివరిదశలో ఉన్న పంటలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. 'ఆంధ్రజ్యోతి' మినీలో ఈ నెల 24న 'కదిలిస్తే కన్నీటి వరద' అనే శీర్షికన రైతుల కష్టాలను ప్రచురించింది. వరద కాల్వకు నీటి సరఫరా చేయడానికి అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ(వ్యవసాయం)

మొదట్లో నాగార్జునసాగర్ రిజర్వాయర్ వరదనీటితో నిండుకుండలా మారడటంతో ఎడమకాల్వతో పాటు వరదకాల్వకు సాగు నీటివిడుదల చేశారు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు సజావుగా నీరు వస్తుండటంతో ఐదు మండలాల్లో ఈ కాల్వ కింద సుమారు 45వేల ఎకరాల్లో వరిని సాగుచేశారు. ఇటీవల రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో వరదకాల్వకు నీరందలేదు. దాంతో ఈ నెల 15 నుంచి వరద కాల్వకు సాగు నీటి విడుదల నిలిచింది. కాల్వ కింద సాగు చేసిన పంటలు చేతి కొచ్చేది కష్టంగా మారింది. అప్రమత్తమయిన అధికారులు రిజర్వాయర్ నుంచి మోటార్లు వరకు ఉన్న(కిలో మీటర్ పొడవు) అప్రోచ్ కాల్వను ఎక్స్‌వేటర్ ను సుమారు 50గంటలు వినియోగించి లోతు తీశారు. దీనికి తోడు శ్రీశైలం నుంచి 20-30వేల క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తోంది. దాంతో జలాశయంలో 521 అడుగుల వద్ద నీరు నిలకడగా ఉంది. ఈ నెల 24న ఒక మోటారు ద్వారా 300క్యూసెక్కుల నీటిని వరదకాల్వకు విడుదల చేశారు. 27వ తేదీ వరకు కాల్వకు చివరి మండలం అయిన మాడ్గులపల్లి మండలంలోని 72 కిలోమీటర్ల వద్దకు నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో మరో మోటార్ వినియోగంలో తీసుకువచ్చి రెండు మోటార్ల ద్వారా 600 క్యూసెక్కుల నీటిని పంటలు పూర్తయ్యే వరకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.



వరద కాల్వలో ప్రవహిస్తున్న సాగు నీరు

వరదకాల్వ రాకతో పంటలు చేతికొస్తాయి



నాలుగు ఎకరాల్లో కాల్వ ఆధారంగా వరి సాగు చేశా. ఈ నెల 15 నుంచి వారం రోజుల వరకు సాగు నీరు రాకపోవడంతో పంట అంతా ఎండిపోయే దశకు చేరుకుంది. పంటపై పూర్తిస్థాయిలో ఆశ వదులుకున్నా. నాలుగు రోజుల కిందట కాల్వకు నీటి విడుదల జరగడంతో కొనఊపిరితో ఉన్న పంటలు జీవం పోసుకున్నాయి. మరో 10-15 రోజుల్లో పంట చేతికొస్తుంది. నాతో పాటు తోటి రైతులు చాలా సంతోషంగా ఉన్నారు.

తరి వెంటకయ్య, రైతు, రామడుగు, అనుముల మండలం

కంటి మీద కునుకు లేదు



వరదకాల్వకు నీరు నిలిచిపోయిన దగ్గర నుంచి పంటలు ఎండిపోతుండటంతో కంటి మీద కునుకు లేకుండాపోయింది. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి యుద్ధ ప్రాతిపదికన అప్రోచ్ కాల్వ పనులు వేగవంతంగా చేపట్టారు. ఎట్టకేలకు వరద కాల్వకు నీటి విడుదల చేశారు. మూడు రోజులుగా వరసగా నీరు వస్తుండటంతో పొలాలకు నీరు పెట్టుకున్నాం. ఇప్పుడు ఇపుడు కోలుకుంటున్నాయి.

మందడి సుధాకర్‌రెడ్డి, రైతు,రామడుగు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో
ఇద్దరు మృతి

యాదగిరిగుట్టరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గౌరాయపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కైరంకొండ హరీష్(26) గురువారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో బైక్‌పై గుట్టకు వ్యక్తిగత పనుల మీద వచ్చి తిరిగి వెళ్తున్నాడు. మాసాయిపేట గ్రామశివారులో రోడ్డు దాటుతున్న యువకుడిని హరీష్ బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో హరీష్ రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమైంది. హుటాహుటిన 108 వాహనంలో చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగానే అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం ఢీకొట్టిన యువకుడు వరిపొలంలో పడటంతో స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు చెప్పారు.

పేపర్ రూట్ ఆపరేటర్...

మేళ్లచెర్వు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పేపర్ రూట్ ఆపరేటర్ మృతి చెందాడు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం ఏడుగంటల సమయంలో పేపర్ ఆటో దొండ పాడు వైపు నుంచి చింతలపాలెం మండల కేంద్రం వైపు వస్తోంది. గాంధీనగర్ తండా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మిర్చిలోడ్ ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఆటో నడుపుతున్న డ్రైవర్ తాటికొండ నరేష్(50)కు తలకు తీవ్రగాయం కావటంతో చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసు పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. ఘటనకు కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ అజ్మీరా గాంధీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రెండు దేవాలయాల్లోని హుండీలు చోరీ

చౌటుప్పల్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్‌లింగోటం, పంతంగి గ్రామాల్లోని దుర్గామాత దేవాలయాల్లో హుండీ కానుకలు చోరీకి గురయ్యాయి. సీఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దుర్గామాత ఆలయాల్లో బుధవారం రాత్రి దొంగలు హుండీ తాళాలు పగులగొట్టి అందులోని కానుకలను అపహరించారు. గురువారం ఉదయం ఆలయ నిర్వహకులు గమనించి ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శాలిగౌరారం ఆర్‌డబ్ల్యూఎస్
ఏఈ సస్పెన్షన్

శాలిగౌరారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మిషన్ భగీరథ ఏఈ గంజి రాంబాబును సస్పెండ్ చేస్తూ నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాంబాబు ఏడాదిగా మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్‌లో చేసిన పనులకు ఎంబీ రికార్డు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని, విధుల్లోనూ నిర్లక్ష్యం చేస్తుండటంతో అతడని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

‘కార్మిక’ సంఘం ఎన్నిక రసవత్తరం

» ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో పోటాపోటీగా సంఘాలు ప్రచారం
పొత్తుల కోసం కార్మిక సంఘం నాయకుల చర్చలు

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం ప్రీమియర్ కంపెనీలో ఈ నెల 29న కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. మూడేళ్లకోసారి జరిగే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో గెలుపుకోసం కార్మిక సంఘాలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ప్రధాన కంపెనీలో స్టాఫ్, కార్మికులు కలిసి మొత్తం 390 మందికి ఓటుహక్కు ఉంది. గతంలో బీఎంఎస్ పార్టీ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన బీఆర్ఎస్‌కేవీ, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ కలిసి పోటీ చేశాయి. అందులో సీఐటీయూ, బీఎంఎస్ వేర్వేరుగా పోటీ చేయడంతో స్వల్ప మెజార్టీతో బీఆర్‌ఎస్‌కేవీ సీఐటీయూపై విజయం సాధించింది.
(ఆంధ్రజ్యోతి- యాదగిరిగుట్టరూరల్)

ప్రస్తుతం జరుగుతున్న గుర్తింపు ఎన్నికల్లో ఇప్పటికే బీఆర్ఎస్‌కేవీ, బీఎంఎస్ పొత్తులు కుదుర్చుకొని గెలుపుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. కంపెనీ బీఆర్ఎస్‌కేవీ గౌరవాధ్యక్షుడు డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు. గతంలో అధికారంలో బీఆర్ఎస్ అండగా ఉండి ఎమ్మెల్యే సైతం గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఉండటంతో ఆ యూనియన్‌కు గెలుపు రెండుసార్లు అదృష్టం కలిసి వచ్చింది. ఈ సారి అధికారం లేకపోవడం కేవలం ఆరేళ్లుగా కార్మికులకు ఆయూనియన్ అందించిన సేవలపైనే వారి గెలుపు ఆధారపడి ఉంది. దీంతో బీఎంఎస్ బీఆర్ఎస్‌కేవీకి చెందిన కార్మికులతో కలిసి పలుమార్లు సమావేశాలు నిర్వహిస్తూ కార్మికులందరిని కూడగట్టే విధంగా గొంగిడి మహేందర్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. ఎలాగైనా మూడోసారి గెలుపొందాలని తమకు బీఎంఎస్ మద్దతు ఇవ్వడం సునాయసంగా గెలుస్తామని ధీమాతో ఉన్నారు. సుమారు 130 ఓట్లు ఉండగా, బీఎంఎస్‌కు సగానికి పైగా మద్దతు ఉన్నట్లు తెలిసింది. గతంలో తక్కువ మెజార్టీతో ఓడిపోయిన సీఐటీయూకు ప్రస్తుతం సుమారు 125 ఓట్లు ఉండగా ఐఎన్‌టీయూసీ 20, హెచ్ఎంఎస్‌కు సుమారు 28 ఓట్లు, ఐఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీలు సైతం సీఐటీయూకు మద్దతు ప్రకటించిందని గతంలో కేవలం 3 ఓట్లతో ఓడిపోయిన సీఐటీయూ ఎలాగైనా ఈసారి గెలుపు తమ సొంతం చేసుకోవాలని తీవ్ర ప్రయత్నాలు తీస్తోంది. గతంలో సీఐటీయూ వీడిపోయి కార్మికులతో సైతం విడివిడిగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మరోవైపు ఐఎన్‌టీయూసీ ఉండటంతో కొంతవరకు అధికారపార్టీ అండ సైతం దొరికే అవకాశం లేకపోలేదు.

ఎవరికీ వారే ధీమా

ఎలాగైనాబీఆర్ఎస్‌కేవీని ఓడించాలని ఆయా గ్రామాల్లో ఉండే కార్మికుల వద్దకు వెళ్లి తమ యూనియన్ పనితీరు కార్మికులకు నెరవేర్చే కోర్కెలను వారికి వివరిస్తూ కార్మికులను తమ వైపు తిప్పుతూ ఈ సారి కార్మికులు అందరూ సహకరించి సీఐటీయూని గెలిపించాలని జిల్లా స్థాయి నాయకులు ఇక్కడే మకాం వేసి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

దీంతో కంపెనీలో రసవత్తరంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఎవరికి వారే గెలుపు తమదేనంటే తమదేనని ధీమాతో ఉన్నారు. కార్మికులు మరోసారి బీఆర్ఎస్‌కేవీని మరోసారి గెలిపిస్తారా? లేక సీఐటీయూకి పట్టం కడతారో ఎదరు చూస్తున్నారు.

ఒకే గొడుగు కిందికి మహిళా సంఘాలు

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి మిషన్-2025 కు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలకు ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మేరకు మెప్మాను సెర్ప్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 15ను జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఒకే ప్రభుత్వశాఖ పర్యవేక్షించనుంది.
- (ఆంధ్రజ్యోతి -భువనగిరి టౌన్)



» సెర్ప్‌లో మెప్మాను విలీనం చేస్తూ జీవో
» ఒక్కటి కానున్న పట్టణ, గ్రామీణ మహిళా సంఘాలు

ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న పట్టణ, గ్రామీణ మహిళా సంఘాలు ఒకే గొడుగు కిందికి చేరాయి. అయితే విలీన విధివిధానాలు, ప్రస్తుత మెప్మా సిబ్బంది ఉద్యోగ భద్రత తదితర అంశాలపై ప్రభుత్వం త్వరలో జారిచేసే మార్గదర్శకాలతోనే స్పష్టత రావల్సి ఉంది. అలాగే ప్రస్తుత స్వయం సహాయక సంఘాలకు అదనంగా కిశోర బాలికల, వృద్ధ స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీల్లో ప్రస్తుతం 15,559మహిళాసంఘాలు కొనసాగుతుండగా వివిధ స్థాయిల్లో 560 మంది పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను విలీనం చేస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 15 మార్గదర్శకాలపై ఆయా ఉద్యోగులలో ఉత్కంఠ నెలకొనది. ప్రభుత్వ నిర్ణయంతో ఇప్పటి వరకు మెప్మా పర్యవేక్షణలో ఉన్న పట్టణ మహిళా సంఘాలు త్వరలోనే జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పర్యవేక్షణలో ఉన్న సెర్ప్ పరిధిలోకి వెళ్లనున్నాయి. దీంతో మునిసిపాలిటీల కనుసన్నల్లో కొనసాగిన మెప్మాను సెర్ప్‌లో విలీనం చేస్తుండటంతో పట్టణ కార్యకలాపాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ జోక్యం నేరుగా పెరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు తదితర స్వయం సహాయక సంఘాల సమస్యలపై ఇటీవల వరకు మునిసిపల్ కమిషనర్లను కలిసిన పట్టణ మహిళలు విలీన ప్రక్రియ పూర్తయ్యాక ఏ అధికారిని కలవాల్సి వస్తుందో తేలాల్సి ఉంది. అలాగే మెప్మా కార్యకలాపాలపై, సిబ్బంది విధుల నిర్వహణపై మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో చర్చించే అవకాశాలు కొనసాగుతాయా? లేక ఆ అధికారాలు బదిలీ అవుతాయో తెలియాల్సి ఉంది. ఇక నుంచి మునిసిపల్ సమీక్ష సమావేశాలకు సెర్ప్ సిబ్బంది హాజరు కావాల్సి ఉంటుండగా మునిసిపల్ కార్యాలయాల్లో కొనసాగుతున్న మెప్మా విభాగం కొనసాగింపుపై కూడా తేలాల్సి ఉంది. మునిసిపాలిటీలోని టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్ కొనసాగింపు లేదా పేరు మార్పు, నిర్వహణ తీరు తదితర అం శా లు ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలతోనే స్పష్టత వస్తుంది.

కరువైన స్పష్టత

క్షేత్రస్థాయి మునిసిపల్ కార్యకలాపాల్లో కీలకంగా ఉండే మెప్మా ఆర్పీలపై యథావిధిగా మునిసిపాలిటీల ఆజమాయిషీ కొనసాగుతుందా లేక వారి సేవల కోసం మునిసిపల్ అధికారులు గ్రామీణఖివృద్ధి శాఖ లేక సెర్ప్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందా తదితర అంశాలపై మునిసిపల్ యంత్రాంగంలో ఆసక్తి నెలకొనది. అయితే సెర్ప్ విలీనాన్ని మెప్మా ఆర్పీలు స్వాగతిస్తున్నట్లు తెలుస్తోంది. మునిసిపాలిటీల్లో చేపట్టే ప్రతి సర్వేను చేయాల్సి రావడం, స్వచ్ఛ సర్వేక్షణ్ హరితహారం తదితర అన్ని పనులను తామే చేయాల్సి వస్తుండటంతో పని భారం పెరుగుతుండటంతో పాటు మహిళా సంఘాల పనులను సకాలంలో చేయలేకపోతున్నామని ఆర్పీలు అంటున్నారు. విలీన నిర్ణయంతో తాము సంఘాలకు మెరుగైన సేవలను సకాలంలో అందిస్తామని పేర్కొంటుండటం గమనార్హం. ముఖ్యంగా జిల్లా, పట్టణ స్థాయిలో పనిచేస్తున్న మెప్మా ఉద్యోగ భద్రత, వేత నాలపై ఆయా కుటుంబాల్లో ఆందోళన నెలకొనది.

కొత్తగా కిశోర బాలిక, వృద్ధ మహిళా సంఘాలు

మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా అన్ని మహిళా సంఘాలను ప్రభుత్వం ఒకే గొడుగు కిందికి చేర్చింది. నిరుపేద మహిళలకు వృత్తి ఉపాధి శిక్షణ, బ్యాంకు లింకేజీ రుణాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆదాయ మార్గాలను కల్పించేందుకు ఇందిరా మహిళా శక్తి మిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే మహిళా సంఘాలకు ప్రతి జిల్లాకు ఒక సోలార్ పవర్ యూనిట్, పెట్రోల్‌బంక్, ఆహార పదార్థాల నిర్వహణ కేంద్రాలు తదితర ఆదాయ వనరులను కల్పించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే ఇప్పటివరకు 60 ఏళ్ల వయసుగల మహిళలకే స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలుగా ఉండే అర్హత ఉంది. కానీ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం 15-18 ఏళ్ల బాలికలతో కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేసి 18 ఏళ్ల పూర్తయిన వెంటనే స్వయం సహాయక సంఘాలలో చేరే విధంగా అవకాశాలు కల్పించనున్నారు. 60 ఏళ్ల దాటిన మహిళలతో వృద్ధ మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో సభ్యులు ..

ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీల్లో ప్రస్తుతం 15,559 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 1.60 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. 548 ఎస్ఎల్ఎఫ్‌లు, 23 టీఎల్ఎఫ్‌లు ఉండగా 26 మంది జిల్లా, పట్టణస్థాయి ఉద్యోగులు ఉండగా 539 మంది రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లు విధులు నిర్వహిస్తున్నారు.

పోచంపల్లి ఇక్కత్ చీరల నకిలీలను అరికట్టాలి

- *రూ.100 కోట్లతో రక్షణ నిధి ఏర్పాటు చేయాలి*
- *కేంద్ర మంత్రికి ఎంపీ చామల లేఖ*

భువనగిరి (కలెక్టరేట్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పోచంపల్లి ఇక్కత్ చీరల నకిలీలను అరికట్టి చేనేత రక్షణ కోసం రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేర కు గురువారం కేంద్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. లేఖ సారాంశానికి సంబంధించి పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 30 వేలకు పైగా చేనేత మగ్గా లు ఉన్నాయని వాటిలో 15 వేల కు పైగా మగ్గాలు పోచంపల్లి చేనేత చీరలను తయారు చేస్తున్నారు. చేనేత రంగంలో పరోక్షంగా 50 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని, కొన్నేళ్లుగా మార్కె ట్‌లో నకిలీ పోచంపల్లి చీరల ప్రవేశంతో చేనేత వృత్తి ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. పోచంపల్లి చేనేత చీరలు మార్కెట్‌లో 10వేలు ఉంటే నకిలీ చీర 600కే విక్రయించడంతో నష్టపోతూ ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. 2004లో పోచంపల్లి ఇక్కత్ డిజైన్లకు భౌగోళిక గుర్తింపు కల్పించినప్పటికీ రక్షణ లేదన్నారు. నకిలీ చీరల ఉత్పత్తిని అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధిని ఏర్పాటు చేయాలని, పోచంపల్లి ఇక్కత్ చీరలకు ప్రత్యేక ట్యాగ్ ఏర్పాటు చేసి విరి విగా ప్రచారం చేయాలని కోరారు. నైపుణ్య రంగంలో భారత దేశం ముందుందని ప్రభుత్వం చెబుతున్నా చేతి వృత్తి కార్మికుల పనిలో నకిలీలతో ఆందోళన కలిగిస్తున్నాయని వెంటనే చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించారు. అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పా ల్గొ న్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 39,62,875 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

మే 17 నుంచి కల్లేపల్లి మైసమ్మతల్లి జాతర



దామరచర్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామచరచర్ల మండలం కల్లెపల్లి గ్రామంలో కొలువైన ఉన్న శ్రీబంగారు మైసమ్మతల్లి జాతరను మే 17, 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ధీరావత్ దస్రూనాయక్, ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. ఆలయం వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్లకోసారి జరిగే అమ్మవారి జాతరను నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో మాజీ సర్పంచ్ జనార్దన్‌నాయక్, మాజీ ఎంపీటీసీ నెహ్రూనాయక్, మాజీ సర్పంచ్ లింగానాయక్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పాచ్యానాయక్, లింగానాయక్, రామ్మోహన్‌నాయక్, మాలు నాయక్, సైదానాయక్, మాన్యానాయక్, రామ్మోహన్‌నాయక్, సైదానాయక్ పాల్గొన్నారు.

దేశంలో కుల నిర్మూలన జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

భువనగిరి గంజ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కుల సమస్య సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుందని కుల నిర్మూలన జరగాల్సిందనని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపెట్ల స్కైలాబ్ బాబు అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో గురువారం మహనీయులు జయంతి పురస్కరించుకొని, సామాజిక చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులం పేరుతో దాడులు, దౌర్జన్యాలు పెరిగి పోయాయని, భారత రాజ్యాంగాన్ని తొలగిస్తామని, మనుధర్మశాస్త్రాన్ని తీసుకొస్తామని చెబు తూ దళిత, గిరిజనులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో 6, 486 కులాలు 28వేల ఉపకులాలు ఉన్నాయని, తరతరాలుగా మనుస్మృతి, మనుధర్మశాస్త్రం ఆధారంగా మనిషిని మనిషిగా చూసే పరిస్థితి లేదన్నారు. అంబేడ్కర్ అందించిన భారత రా జ్యాంగ ఫలాలను ప్రతి పౌరుడు అందుకునే నిజమైన రోజు రావాలంటే దేశంలో కుల వ్యవస్థ నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ నాలెడ్జి సెంటర్ కోఆర్డినేటర్ బానోత్ భాస్కర్‌నాయక్, సరుపంగ శివలింగం, బట్టు రాంచంద్రయ్య, మల్లారెడ్డి, దుబ్బ రామకృష్ణ, అన్నంపట్ల కృష్ణ, బసాని మహేందర్, వెంకటేష్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



గోదాంను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

చింతపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ ఎన్ ఫోర్స్‌మెంట్ డీటీ ఎం.రఘునందన్ తెలిపారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు అక్రమంగా సిలిండర్లను విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. గ్యాస్ బుక్ చేసిన వ్యక్తులకు మాత్రమే సిలిండర్ అందించాలన్నారు. ఇష్టారాజ్యంగా సిలిండర్లు తరలించిన ఏజెన్సీ రద్దు చేస్తామని హెచ్చరించారు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	521.40
టీఎంసీలు	151.8418
ఎడమకాల్వకు నీటి విడుదల	8,454
కుడికాల్వకు	6,041
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	25,123
అవుట్‌ఫ్లో	16,595

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	30.66 టీఎంసీలు
ఇన్‌ఫ్లో	300 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	625.67 అడుగులు
టీఎంసీలు	0.90
కాల్వలకు విడుదల	469.44 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	500.10 క్యూసెక్కులు

అండర్ -13 ఉడ్‌బాల్ విజేతలుగా సెయింట్ మేరీ విద్యార్థులు



కప్‌ను అందుకుంటున్న సెయింట్ మేరీ పాఠశాల విద్యార్థులు

మర్రిగూడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని మాదాపూర్ జిల్లాలో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ 13వ సబ్ జూనియర్ ఉడ్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో మర్రిగూడ మండలంలోని సెయింట్ మేరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు బంగారు పతకం, కప్‌ను గెల్చుకుని విజేతలుగా నిలిచారు. తెలంగాణ జట్టు గుజరాత్ జట్టుపై విజయం సాధించి బంగారు పతాకం కైవసం చేసుకుంది.

బాలికల డబుల్స్ సెమీఫైనల్స్‌లో

తెలంగాణ జట్టు మహారాష్ట్ర జట్టుతో తలపడగా తెలంగాణ జట్టు మూడో స్థానానికి పరిమితమై రజత పతకాన్ని కైవసం చేసుకుంది. అండర్-15 జూనియర్ బాలుర విభాగంలో గోవా రాష్ట్రంతో జరిగిన ఉడ్ బాల్‌లో మూడో స్థానం సాధించి రజత పతకాన్ని గెల్చుకున్నారు. విజేతలకు చత్తీస్‌ఘడ్ ఐఏఎస్ అధికారి కతుల్ ఆత్రే పతకాలు అందజేసినట్లు రాష్ట్ర ఉడ్‌బాల్ కార్యదర్శి ఆదర్శ్, ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల ఉడ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ రహ్మద్‌తోపాటు పవన్‌కుమార్ తెలిపారు. పతకం సాధించిన వారిలో సారిక, నందిని, విఘ్నేష్, కౌశిక్, పవన్ కుమార్ పలువురు ఉన్నారు.

పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ ఘటన హైకోర్టుకు

- *అన్యాయంగా డీబార్ చేశారని విద్యార్థిని వినతి*
- *ఏప్రిల్ 7న కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు సూచన*

నల్లగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పదో తరగతి ప్రశ్నపత్రం వాట్సప్‌లో ప్రత్యక్షమైన ఘటనలో డీబార్ అయిన విద్యార్థిని ఝాన్సీరాణి హైకోర్టును ఆశ్రయించింది. తనను అన్యాయంగా డీబార్ చేశారని, పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరుతూ ఆమె తరుపు న్యాయవాది బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. స్వీకరించిన హైకోర్టు ప్రతివాదులకు ఏప్రిల్ 7వ తేదీన కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నకిరేకల్ ఎస్సీ గురుకులంలోని పదో తరగతి పరీక్షా కేంద్రంలో ఈ నెల 21వ తేదీన విద్యార్థిని ఝాన్సీరాణి వద్ద ఉన్న తెలుగు-1 ప్రశ్నపత్రాన్ని కిటికీ బయట ఉన్న ఆకాష్ అనే వ్యక్తి ఫొటో తీసి వాట్సప్‌లలో షేర్ చేశాడు. ఈ ఘటనలో బాలిక ఝాన్సీరాణిని అధికారులు డీబార్ చేశారు. అయితే తనకు ఈ లీక్ వ్యవహారంతో సంబంధం లేదని, తనకు ఎలాంటి పాపం తెలియదని, అన్యాయంగా డీబార్ చేశారని, తనకు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరుతూ ఝాన్సీరాణి తరపు న్యాయవాది బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను ఎవరికీ పేపర్ ఇవ్వలేదని, కిటికీ పక్కకు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి కిటికీ ఇవతల గదిలో పరీక్ష రాస్తున్న తనని రాయితో కొడతానని బెదిరించడంతో భయపడి పేపర్‌ని చూపించానని ఝాన్సీరాణి పేర్కొన్నారు. ఈ కేసులో ప్రతివాదులుగా విద్యాశాఖ సెక్రటరీ, నల్లగొండ డీఈవో, నకిరేకల్ ఎంఈవో, నకిరేకల్ ఎస్సీ గురుకుల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ని పేర్కొన్నారు. వీరందరూ ఏప్రిల్ 7వ తేదీన కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు సూచించింది. ఈ విషయంలో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల నడుమ పరస్పర ఆరోపణలు కొనసాగుతుండగా, తప్పుడు ప్రచారాలను సోషల్ మీడియాలో పోస్టు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్‌పైనా కేసులు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా బాలిక ఝాన్సీరాణి హైకోర్టును ఆశ్రయించడంతో కేసు దర్యాప్తుపై అందరికీ ఆసక్తి నెలకొంది.

‘బీసీల లొల్లి’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



బీసీల లొల్లి వాల్ పోస్టర్‌ను అవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఏప్రిల్ రెండో తేదీన జరిగే ‘బీసీల లొల్లి’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం నల్లగొండలోని సావిత్రిబాయి పూలే, జ్యోతిబాపూలే బీసీ భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలో బీసీలలొల్లి వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్య, ఉద్యోగ రంగంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ శాసనసభలో బిల్లును ఆమోదించడంపై బీసీల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన అన్ని పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడానికి బీజేపీ, మిత్రపక్ష రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. బీసీ బిల్లులో ముస్లింలను చేర్చడాన్ని తప్పుపడుతూ ఈ బిల్లును ఆమోదం చేయకుండా బీజేపీ ప్రభుత్వం అడ్డుపడాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలను, 8 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ఘనత బీసీలదేనని అన్నారు. బీసీ బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీ బిల్లు విషయంపై బీజేపీ, అనుబంధ రాజకీయ పార్టీలకు తెలంగాణ బీసీల సత్తా చాటడానికి ఏప్రిల్ 2న జంతర్ మంతర్ వద్దన బీసీల సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 25 వరకు బీసీ బిల్లును ఆమోదింపు చేస్తే విజయోత్సవ సభ పెడతామని, ఒకవేళ ఆమోదించనట్లయితే బీజేపీపై యుద్ధాన్ని ప్రకటిస్తామని అన్నారు. తెలంగాణలోని బీజేపీ మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకొని ఈ బిల్లు ఆమోదం పొందడానికి ప్రయత్నం చేయాలన్నారు. ప్రధాని ఒక బీసీ కాగా, బీసీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి పథకాన్ని ప్రవేశ పెట్టలేదని విమర్శించారు. బీసీ మంత్రిత్వ శాఖ, మహిళా బిల్లులో బీసీలకు వాటా కేటాయించలేదని, కాని తాను బీసీనని ప్రధాని చెప్పుకుంటూ కాలం గడుపుతు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ, తెలంగాణ మేధావుల వేదిక రాష్ట్ర కన్వీనర్ నల్ల సోమ మల్లన్న, కాసోజు విశ్వనాథం, నకరికంటి కాశయ్యగౌడ్, గోలి విజయ్‌కుమార్, అదనపు కార్యదర్శి, జాజుల భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగకు సన్నబియ్యం


(5వపేజీ తరువాయి)

మొదలైంది. సన్నబియ్యాన్ని పేదలకు ఉచితంగా అందించేందుకు కిలోకు రూ.40 వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని మంత్రి ఉత్తమ్ పేర్కొనడంతో, ఈ బియ్యం కోసం ఎంత ఖర్చు పెడుతుందనే అంశంపై స్పష్టత వచ్చింది. ఉమ్మడి జిల్లానే పరిశీలిస్తే ప్రతి నెలా కనీసం 17,869 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు గాను ప్రతినెలా రమారమి రూ.71.48 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. యేడాదికి కనీసం రూ.857.76 కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుంది.

కొత్త కార్డులకూ ఉగాది నుంచే సన్నబియ్యం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇవ్వదల్చుకున్న రేషన్‌కార్డులకు, కొత్తగా నమోదైన లబ్ధిదారులకు సైతం ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని గురువారం హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో కొత్త రేషన్‌కార్డులకు ఎదురుచూస్తున్న వారికి శుభవార్త చెప్పినట్లయింది. నల్లగొండ జిల్లాలో గతంలో మీసేవా ద్వారా ఏడువేల దరఖాస్తులు రాగా, ప్రజాపాలనలో అత్యధికంగా 1.25 లక్షల దరఖాస్తులొచ్చాయి. సూర్యాపేట జిల్లాలో ప్రజాపాలనలో దాదాపు 46,543 దరఖాస్తులు రాగా, మీసేవా కేంద్రాల ద్వారా 2వేల పైచిలుకు దరఖాస్తులొచ్చాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ ప్రజాపాలన కింద 32,352 దరఖాస్తులు రాగా, మీసేవ ద్వారా 680 దరఖాస్తులొచ్చాయి. వీటన్నింటిలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కసరత్తు సాగుతోంది. మంత్రి స్వయంగా ప్రకటించడంతో ఇందులో ఎంతమందికి కార్డుల జారీ చేస్తారనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏప్రిల్‌లో కొత్తకార్డుల పంపిణీ చేస్తారని భావిస్తున్నారు.

దుర్వినియోగం చేయవద్దు



దేశంలోనే ఎక్కడా లేని రీతిలో మొదటి సారిగా భారీగా వ్యయమవుతుందని తెలిసినా ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించే క్రమంలో సన్నబియ్యం ఇవ్వాలని సీఎం, నేను నిర్ణయించాం. ఏడాదికి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.8వేల కోట్ల వరకు ఈ బియ్యానికి ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయినా వెనకాడకుండా నిర్ణయం తీసుకున్నాం. గత కొన్నేళ్లుగా రేషన్ బియ్యం కింద దొడ్డు బియ్యం, నాణ్యతలేని బియ్యం ఇచ్చారు. ఆ బియ్యాన్ని దాదాపు 90 శాతం వినియోగించకుండా ఇటు లబ్ధిదారులో, డీలర్లో ఏదో రకంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించిన విషయం వాస్తవమే కదా..? వీటన్నింటికీ చెక్‌పెడుతూ రేషన్‌కింద ప్రజలు తినే సన్నబియ్యమే ఇవ్వాలని, ఎంతవ్యయమైనా వెనకాడవద్దని ఆలోచించి ఈపథకం ప్రవేశపెడుతున్నాం. ఇది ప్రజలదరికీ చేరి దేశానికి ఆదర్శంగా నిలిచేలా లబ్ధిదారులంతా సహకరిస్తారని ఆశిస్తున్నాం.

● ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి

అంబేడ్కర్ ప్రపంచానికి దిక్సూచి

మర్రిగూడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచానికి దిక్సూచి అని మేటి చంద్రాపురం మాజీ సర్పంచ్ జంగిలి లక్ష్మీప్రసన్న రవి అన్నారు. మండలంలోని ఇందుర్తి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 14వ తేదీన అంబేడ్కర్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. విగ్రహ ఏర్పాటు కోసం స్లాబ్ వేసినట్లు ఆమె తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మర్రిగూడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన కొంతమంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాందాసు శ్రీనివాస్, మేతరి యాదయ్య చెక్కులు పంపిణీ చేశారు. యరగండ్లపల్లి, బట్లపల్లి గ్రామాలకు చెందిన వారికి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క శ్రీను, ఎన్నమనేని రవీందర్‌రావు, శ్రీశైలం, వెంకటంపేట బాలయ్య, మాస శేఖర్, నగేష్ పాల్గొన్నారు.

శాలిగౌరారం ఫీడర్ ఛానల్‌లో

అన్నదాతల శ్రమదానం

● గుర్రపు డెక్కను తొలగించిన రైతులు



తుర్కపల్లి రెగ్యులేటర్ వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగిస్తున్న రైతులు

శాలిగౌరారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న ఫీడర్ ఛానల్ పరిధిలో గుర్రపు డెక్క పేరుకుపోయి నీటి రాకను అడ్డుకుంటోంది. దీంతో శాలిగౌరారం ప్రాజెక్టుకు నీరు సక్రమంగా రావడం లేదు. దీంతో రైతు సంఘం నాయకులు చామల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తిరుమలరాయినిగూడెం, జాలోనిగూడెం, రామగిరి గ్రామాలకు చెందిన రైతులు తరలివెళ్లి శ్రమదానం చేశారు. ఫీడర్ ఛానల్ పరిధిలోని తుర్కపల్లి హెడ్ రెగ్యులేటర్ వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్కను రైతులు శ్రమదానంతో తొలగించారు. అమ్మనబోలు జాలకుంట వద్ద మూసీ నదిలోకి పేరుకుపోయిన గుర్రపు డెక్కను రైతులు శ్రమదానంతో తొలగించారు. అమ్మనబోలు జాలకుంట వద్ద మూసీ నదిలోకి నీరు వృథాగా పోకుండా ఇసుక బస్తాలను అడ్డుగా వేసి శాలిగౌరారం ప్రాజెక్టులోని నీటిని మళ్లించారు. శ్రమదానం చేసిన వారిలో ఆకుల యాదయ్య, పడాల రమేష్, పెంబళ్ల శ్రీనివాస్, వాడపల్లి అంజయ్య, పడాల రవి, తరాల సైదులు, చీమల శంకర్, పెంబళ్ల శంకర్, మాద నర్సింహ ఉన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న రైతు సంఘం నాయకుడు శ్రీశైలం

మర్రిగూడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూగర్భజలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. మండల రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. మండలంలో సర్వే నిర్వహించి ఎండిపోయిన పంట పొలాలను గుర్తించి పరిహారం అందేవిధంగా చూడాలని కోరారు. ఆరు గ్యారెంటీల అమలు విషయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలయ్యే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, కొట్టం యాదయ్య, వెంకటయ్య, రాఘవేంద్ర, రామలింగాచారి, కృష్ణయ్య, యాదయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలుచేయాలి



ప్రజాభిప్రాయం సేకరిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్

మునుగోడురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుజేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కలవలపల్లిలో బీజేపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరుతూ గ్రామస్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా దర్శనం వేణుకుమార్ మాట్లాడుతూ 15 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొత్త శంకర్, నాయకులు పర్న అంతిరెడ్డి, కొండ శంకర్, పగిళ్ల సైదులు, ఉప్పరి నర్సింహ, గణేష్, కంభంపాటి శ్రీరామ్, బొడ్డు లింగయ్య, భూపాల్, రమేష్, మల్లేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కనగల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చినమాదారం గ్రామానికి చెందిన ఒట్టికోటి ఎల్లేశం కుటుంబానికి అతని స్నేహితులు, చినమాదారం హైస్కూల్ 2002-03 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు అండగా నిలిచారు. మృతుడి కుమార్తె పేరున రూ.60వేల బ్యాంకు ఎఫ్‌డీ బాండ్‌ను భార్య శ్రీలతకు అందజేసారు. ఎల్లేశం కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎల్లేశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఒట్టికోటి సైదులు, శంకర్, అంజి, రాములు, కోటి, పరమేష్, సత్తయ్య, రమేష్ పాల్గొన్నారు.

తాళం తీస్తే ఒట్టు!

» నిరుపయోగంగా గోపాలమిత్ర భవనం
» లక్షలు వెచ్చించారు వాడకం వదిలేశారు
» అక్కెనపల్లిలో ఏడేళ్లుగా తెరుచుకోని భవనం



అక్కెనపల్లిలో నిరుపయోగంగా ఉన్న గోపాలమిత్ర భవనం, (ఇన్‌సెట్‌లో) చెత్తాచెదారంతో నిండిన నీటితొట్టి



నార్కట్‌పల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పశువుల్లో కృత్రిమ గర్భధారణ చేసేందుకు ఉద్దేశించి నిర్మించిన గోపాలమిత్ర భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. ప్రారంభం అనంతరం భవనానికి వేసిన తాళం మళ్లీ తీయలేదంటే అతిశయోక్తి కాదు. దీంతో గోపాలమిత్ర భవనం వాడకంలో లేకపోవడంతో ఆవరణతో పాటు పశువుల దాహార్తి తీర్చడం కోసం కట్టిన నీటితొట్టి చెత్తాచెదారంతో నిండాయి. అసలు ఇక్కడ నిర్మించిన భవనం వాడకంలో లేదనే విషయం సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు తెలియకపోవడం విడ్డూరం. నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లిలో నాబార్డు పథకం కింద ఆర్‌ఐడీఎఫ్ నిధులు రూ.7.50లక్షల అంచనా విలువతో గోపాలమిత్ర భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని 2017 సెప్టెంబరు 4వ తేదీన అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. భవనం నిర్మించారే తప్ప కృత్రిమ గర్భధారణకు సంబంధించిన ఎలాంటి పరికరాలు ఇవ్వలేదు. దీంతో తొలినాళ్లలో కొన్ని రోజుల పాటు మాత్రమే వినియోగించిన ఈ భవనాన్ని ఆ తదుపరి ఏళ్ల తరబడి నిరుపయోగంగానే మారింది. తలుపులకు వేసిన తాళం తీసిన దాఖలాలు కనిపించలేదు. ఇదిలా ఉంటే ఆయా శాఖలకు సంబంధించిన కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో మగ్గుతుంటే సొంత భవనం ఉండి నిరుపయోగంగా మారిన వైనంపై అటు అధికారులు కాని ఇటు స్థానిక ప్రజాప్రతినిధులు కానీ పట్టనట్లే ఉన్నారు. పశువులు ఉన్న చోటికే వెళ్లి కృత్రిమ గర్భధారణ చికిత్స చేస్తున్నాం కాబట్టి భవనం అవసరం అంతగా లేకపోయిందని స్థానిక గోపాలమిత్ర పేర్కొన్నారు.

భవనాన్ని వాడకంలోకి తేవాలి



లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన గోపాలమిత్ర భవనాన్ని వాడకంలోకి తేవాలి. పశు వైద్య శాల గానో లేకపోతే మరే ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, అనుబంధ సంస్థలకు ఉపయోగపడేలా వినియోగంలోకి తెచ్చేందుకు మండలంలోని అధికారులు కూడా ఆలోచన చేయాలి.
- చిరబోయిన రాజు, మాజీ వార్డు సభ్యుడు

భవనం వాడకంలో లేదని తెలియదు

అక్కెనపల్లిలో గోపాలమిత్ర భవనం నిరుపయోగంగా మారిందనే విషయం తన దృష్టిలో లేదు. ఆ భవనాన్ని ఏళ్ల తరబడి ఎందుకు నిరుపయోగంగా ఉంచారో తెలుసుకుని వాడకంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటా.
- రాజశేఖర్, ఈవోడీఎల్‌డీఏ ఏడీ

నేడు ఇఫ్తార్ విందు

కనగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్లాంనగర్, కనగల్, చెట్లచెన్నారం, ఎస్‌లింగోటం గ్రామాల్లో శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని సంతోషాలతో నిర్వహించుకోవాలని కోరారు.



బోరు మోటారు బిగించిన అధికారులు

తిరుగండ్లపల్లిలో బోరు మోటార్ ఏర్పాటు

మర్రిగూడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో సమస్యలను ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఐతపాక జంగయ్య ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయన సొంత ఖర్చులతో పాత గ్రామపంచాయతీ వెనకాల ఉన్న బోరును శుభ్రం చేయించి బోరు మోటారు ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, నర్సింహ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతం కోసం పనిచేసిన మైసయ్య



మైసయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి గుండగోని మైసయ్య అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గుండగోని మైసయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఒక మంచి నేతను కోల్పోయామని అన్నారు. ప్రాణాలు సైతం పణంగా పెట్టి ప్రజా సేవలో అహర్నిశలు శ్రమించిన నేత గుండగోని మైసయ్య అని కొనియాడారు. మైసయ్య ఆశయ సాధన కోసం జిల్లాలో కాషాయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు కాసం వెంకటేశ్వర్లు మాట్లాడు తూ మైసయ్య తన రాజకీయ జీవితంలో ఎన్నో అడ్డంకులు అధిగమించి నిస్వార్థంగా పనిచేశారని పేర్కొన్నారు. దేశద్రోహుల కుట్రలు, ఎన్నో దాడులను తట్టుకొని చివరకు నక్సలైట్ల చేతిలో బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరన్న చంద్రశేఖర్, గుండగోని గిరిబాబు, దోనూరు వీరారెడ్డి, సాధినేని శ్రీనివాస్, ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● గట్టుప్పల్ మండలంలోని తేరటిపల్లి గ్రామంలో గుండగోని మైసయ్య విగ్రహానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప మాట్లాడుతూ మైసయ్య పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, నాయకులు దుర్గయ్య పాల్గొన్నారు.

వంద రోజుల పని దినాలు కల్పించాలి

● ఎంపీడీవో బండారు యాదగిరి

చండూరురూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ప్రతీ కూలీకి విధిగా వంద రోజుల పని దినాలు కల్పించాలని ఎంపీడీవో బండారు యాదగిరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అందులో భాగంగా గూగుల్ మీట్ ద్వారా డీఆర్‌డీవో, సీఈవో, డీపీవోలు ఉపాధి హామీ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే సంవత్సరానికి ఉపాధి కూలీలకు ప్రతి గ్రామంలో పనులు ప్రారంభించి వం ద రోజుల పనిని అందరికీ కల్పించే విధంగా పనులు ప్రణాళికలు రూపొందించి సి ద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న దైద రవీందర్

కేతేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగని టీపీసీసీ నాయకుడు దైద రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు, కేతేపల్లి మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాసయాదవ్ అన్నారు. మండలంలోని కొర్లపహాడ్‌లో దైద రవీందర్, భీమారంలో బడుగుల శ్రీనివాసయాదవ్‌లు గురువారం వేర్వేరుగా ముస్లింలకు ఇఫ్తార్ విందులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని అన్నారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు జి.రవీందర్‌రెడ్డి, ఎండీ.యూసుఫ్‌జానీ, జి.వెంకటయ్య, కుమ్మరి నాగయ్య, బి.శేఖర్‌రెడ్డి, అంజయ్య, ఉపేందర్‌రెడ్డి, ముస్లిం మతపెద్దలు అశ్రర్, ఇబ్రహీం, నాజంఅలీ, ఫరీద్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలి

● నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



కట్టంగూరులో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

కట్టంగూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. కట్టంగూరులో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదాల నివారణపై లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, యువకులు స్థానికులతో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కట్టంగూరు మండలంలోని జాతీయ రహదారి వెంట బ్లాక్ స్పాట్‌లను నిర్మించామని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రాంగ్ రూట్‌లో వెళ్లవద్దని, యూటర్న్, ప్రమాదకర జంక్షన్ల వద్ద తగిన సమయం తీసుకొని రహదారిని దాటాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో అనేక మంది విగత జీవులయ్యారని, కట్టంగూరులోని నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉందని ఆ ప్రదేశం వద్ద వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్లకుండా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు, వాహనదారులు సహకరించాలని కోరారు. ప్రమాదాల నివారణపై పాటలతో కళాజాతా ప్రదర్శించారు. కార్యక్రమంలో శాలిగౌరారం రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, కట్టంగూరు ఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది మునా సత్యనారాయణ, శంకర్, సతీష్, వెంకన్న, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

కట్టంగూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు అన్నారు. వీవోఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా అక్రమ అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ కట్టంగూరు మండల కేంద్రంలో వీవోఏలు గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. బడ్జెట్ సమావేశంలో వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జాల రమేష్, వీవోఏలు నాగమణి, సులోచన, సుజాత, శోభారాణి, లలిత, శైలజ, ఉమ, నందిని, మమత తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల అరెస్టు

నార్కట్‌పల్లి: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మండలంలోని పలువురు మాజీ సర్పంచులను గురువారం నార్కట్‌పల్లి పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ప్రభుత్వం తమను అరెస్టులతో అడ్డుకోవడం మానుకుని తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచులు మేడి శంకర్, మహేశ్వరం సతీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి



వెలిమినేడు సీసీరోడ్డు నిర్మాణపనుల శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

చిట్యాలరూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు, పిట్టంపల్లి, ఆరెగూడెం గ్రామాల్లో గురువారం సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేస్తుందన్నారు. కోట్లాది రూపాయలను వెచ్చించి పథకాలను అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజాపాలనందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, కార్యదర్శి తాటికొండ లింగస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, నాయకులు సుర్కంటి సత్తిరెడ్డి, మేడి కృష్ణ, నాగంపల్లి కిషోర్, సాగర్ల నాగరాజు, జెల్ల నర్సింహ, దశరథ, దేశబోయిన మల్లేష్, అందె రాములు, అంతటి నర్సింహ, భీష్మారెడ్డి, అజిత్‌రెడ్డి, సత్తయ్య, శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి, రాజు, హెచ్ఎం నర్సిరెడ్డి, వెంకన్న, చందు, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన కల్పించాలి



కస్తాల ప్రాథమిక పాఠశాలలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

చండూరురూరల్, మార్చి 27: విద్యార్థులు గ్రామంలోని ప్రజలకు పచ్చదనం, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్ అన్నారు. గురువారం చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 50మంది విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని కస్తాల గ్రామంలో పలు కార్యక్రమాలు చేపట్టారు.

గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో భాగంగా ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ప లు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామంలోని వీధులు, పరిసరాలను, మురుగుకాల్వలను శుభ్రం చేయనున్నట్లు తెలిపారు. అంతేకాక ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ నర్సింహ, ప్రోగ్రాం ఆఫీసర్ ఐ.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సందీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పకడ్బందీగా పంపిణీ చేయాలి

● తహసీల్దార్ పద్మ




డీలర్లతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మ

కనగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి అమలుచేయనున్న సన్నబియ్యం పంపిణీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ పద్మ ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో రేషన్‌డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పథకం అమలుకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో డీటీ పార్వతమ్మ, ఆర్ఐ సునీత, ఎస్ఏ విఘ్నేశ్వర్‌రెడ్డి, ఏఆర్ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5 శుక్రవారం 28 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.105	170	200
నల్లగొండ	రూ.110	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 22.0

మందకొడిగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ

మొరాయించిన సర్వర్



భూక్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) నమోదుకు దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నా ఈ నెల 30న ఉగాది, 31 రంజాన్ సెలవులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆన్‌లైన్ ప్రక్రియకు లబ్ధిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీల పరిధిలో లబ్ధిదారులు ఆన్‌లైన్ నమోదులో ఇబ్బందులుపడ్డారు. ఉదయం నుంచి సర్వర్ మొరాయించడంతో ప్రక్రియ నెమ్మదించింది. యాదగిరిగుట్టలో ఐదుగురికి మించి ఫీజు చెల్లించలేకపోయారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 33వేల మందికి పైగా ప్రభుత్వం అవకాశం ఇచ్చినా 1,862 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఇక్కడ లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారంటున్నారు. వెరసి ఉమ్మడి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడటౌన్, దేవరకొండ)


6

పట్టణ, గ్రామీణ మహిళా సంఘాలు

ఒకే గొడుగు కిందికి..

- సెర్ప్‌లో మెప్మా విలీనం
- ఉమ్మడి జిల్లాలో 19 మునిసిపాలిటీల్లో 15,559 మహిళా సంఘాలు

7



పట్టణ, గ్రామీణ మహిళా సంఘాలు ఒకే గొడుగు కిందికి చేరాయి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి మిషన్-2025లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ను, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేస్తూ ఈనెల 23న ప్రభుత్వం జీవో 15ను జారీ చేసింది.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)



పండుగకు

సన్నబియ్యం

- పేదలకు నాణ్యమైన బియ్యం అందేలా రేషన్ అక్రమాలకు చెక్‌పెట్టేలా..
- రాష్ట్రస్థాయిపథకాన్ని హుజూర్‌నగర్‌లో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లాలో సన్నబియ్యం కోసం రూ.857.76 కోట్ల వ్యయం
- కొత్తకార్డులకూ ఏప్రిల్ నుంచి సన్న బియ్యం ఇస్తామన్న మంత్రి ఉత్తమ్
- భారీ వ్యయంతో ఇస్తోన్న సన్నబియ్యాన్ని ప్రజలు దుర్వినియోగం చేయవద్దు : పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సన్న బియ్యం పథకం అమలుకు ఏడాదికి రాష్ట్ర స్థాయిలో రూ.8వేల కోట్ల వరకు భారీగా వ్యయమవుతుందని అధికారులు అంచనావేశారు. అయినా పేదలకు ఆహారభద్రత కింద నాణ్యమైన బియ్యం ఇవ్వాలనే ధృడసంకల్పంతో ప్రభుత్వం ముందుకొచ్చింది. రేషన్ కింద సన్నబియ్యం ఇవ్వడం ద్వారా పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందడంతోపాటు, ప్రస్తుతం కొనసాగుతున్న రేషన్‌బియ్యం అక్రమదందా పూర్తిగా నిలిచిపోతుందని స్వయంగా మంత్రులు ఆశాభావం వ్యక్తం చేస్తుండడం ఈపథకం విజయవంతం కావడంపై ప్రభుత్వం పెట్టుకున్న ఆశల్ని తెలియజేస్తోంది. ఈ పథకాన్ని పకడ్బందీ అమలు చేయడంకోసం ఇప్పటికే అన్నివిధాల సన్నాహాలు పూర్తిచేసిన ప్రభుత్వం లోపాలు తలెత్తకుండా, పథకం ప్రారంభమయ్యాక మళ్లీ ఆగకుండా అవసరమైనంత మేర బియ్యాన్ని సైతం అందుబాటులో ఉంచింది.

దేశానికే తలమానికమవుతుందని భావిస్తోన్న కీలక పథకం ఈ నెల 30న ఉగాది రోజున హుజూర్‌నగర్ నుంచి ప్రారంభం కాబోతోంది. రేషన్‌కార్డులున్న లబ్ధిదారులందరికీ ఆ రోజు నుంచి సన్నబియ్యాన్నే రేషన్ కింద అందించే ఈ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో ప్రారంభించబోతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

జిల్లా	రేషన్‌కార్డులు	యూనిట్లు	నెలవారీ కోటా (మెట్రిక్‌టన్నుల్లో)
నల్లగొండ	4,66,522	13,85,506	8,878
సూర్యాపేట	3,05,564	8,79,000	4,750
యాదాద్రి	2,17,072	6,64,043	4,241
మొత్తం	9,89,158	29,28,549	17,869

ఉమ్మడి జిల్లాకు ఏడాదికి రూ.857.70 కోట్లు

ఏప్రిల్ నుంచి రేషన్‌కార్డులున్న ప్రతీ కుటుంబానికీ సన్నబియ్యమే ఉచితంగా అందుతుంది. ప్రతీ లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 29,28,549 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ప్రతినెలా ఆరు కిలోల చొప్పున సమీప రేషన్ దుకాణాల నుంచి సన్నబియ్యం అందుతుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్లకు అవసరమైన బియ్యాన్ని చేరవేశారు. వానాకాలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్న సన్న ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లులకు ఇచ్చి అందులో దాదాపు సగం బియ్యాన్ని ఇప్పటికే జిల్లా స్థాయి గోదాములకు చేరవేయగా, ఏప్రిల్ కోటాకు సంబంధించి ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్లకు, అక్కడి నుంచి రేషన్‌దుకాణాలకు సన్న బియ్యం సరఫరా...



మిగతా 7వ పేజీలో...

నల్లగొండ డీఐఈవోపై

విచారణ చేపట్టాలి

ఇంటర్ విద్యాకార్యదర్శి, కలెక్టర్‌కు వినతి

నల్లగొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి దస్రు నాయక్‌పై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి వి.శేఖర్ డిమాండ్ చేశారు. నల్లగొండ కలెక్టర్‌కు, ఇంటర్ విద్యశాఖ కార్యదర్శికి గురువారం ఆయన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసే క్రమంలో పలువురు కాంట్రాక్ట్ లెక్చరర్లు తప్పుడు సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన విషయాన్ని తాము ఇంటర్‌బోర్డుకి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత లెక్చరర్ల పత్రాలను పరిశీలించి నివేదించాలని జిల్లా ఇంటర్‌బోర్డు విద్యాధికారిని ఆదేశించారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు సమర్పించిన తప్పుడు సర్టిఫికెట్లను తాము ఆర్టీఐ ద్వారా సేకరించామని పేర్కొన్నారు.

ఆ సమాచారాన్ని కూడా ఇంటర్‌బోర్డు, సీబీసీఐడీకి అందజేయగా, ఈ విచారణ పూర్తయ్యేంతవరకు సదరు లెక్చరర్ల వేతనాలు ఆపాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారికి, ఇంటర్‌బోర్డు రీజనల్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయినా డీఐఈవో ప్రిన్సిపాళ్లను ఒత్తిడికి గురిచేసి నకిలీ సర్టిఫికెట్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న లెక్చరర్లకు వేతనాలు అందజేసినట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన నల్లగొండ డీఐఈవోపై విచారణ జరపాలని, క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వేతనాలు ఎందుకివ్వరు?

ఖాతాలో జమచేసినా ఇవ్వడం లేదు

కార్యదర్శిపై మల్టీపర్పస్ వర్కర్ల ఆగ్రహం



మండల కేంద్రంలో గ్రామపంచాయతీ బయట కూర్చొన్న కార్యదర్శిని జీతాల గురించి నిలదీస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

తిరుమలగిరి(సాగర్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): జీతాల కోసం గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఖాతాలో జమ చేసిన తమ వేతనాలను సకాలంలో ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సంఘటన గురువారం తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మల్టీపర్పస్ వర్కర్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో పారిశుధ్య నిర్వహణతో పాటు విద్యుత్, పన్నుల వసూలు తదితర పనులను నిర్వహిస్తున్న జీపీ వర్కర్లకు ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన రెండు నెలల వేతనాలను టీఎస్‌బీపాస్ ఖాతాలో జమచేసింది. దీంతో మల్టీపర్పస్ వర్కర్లు తమ పెండింగ్ వేతనాలను ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను కోరారు. దానికి ఆయన నిరాకరించడమే కాకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి వెళ్లిపోయి బయట కూర్చొన్నాడు. దీంతో ఆగ్రహించిన వర్కర్లు వేతనాల ఇవ్వాలని నిలదీశారు. దీంతో స్థానికులు కూడా పనిచేసిన కార్మికులకు వేతనాలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అనంతరం సదరు మల్టీపర్పస్ వర్కర్లు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవో భిక్షంరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన టీఎస్ బీపాస్ ఖాతాలో వేతనాలు జమ అయ్యాయని వెంటనే సంబంధిత వర్కర్ల ఖాతాల్లో జీతాలు జమ చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. గతంలో కూడా ఐదు నెలల పెండింగ్ వేతనాలను ఇవ్వకుండా వర్కర్లతో జీతాలు తీసుకున్నట్లు రిజిస్టర్‌లో సంతకాలు చేయించుకొని చాలా రోజుల వరకు ఇవ్వలేదని ఆరోపించారు. అంతేకాక కష్టపడి పనిచేసిన తమకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని

సద్వినియోగం చేసుకోవాలి

- సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి



జానారెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్

హాలియా, మార్చి27(ఆంధ్రజ్యోతి): హాలియా వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి చైర్మన్, అధికారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా జానారెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. మార్కెట్ చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 283 మంది రైతుల నుంచి 3,555 క్వింటాళ్ల కందుల కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, కోట నాగిరెడ్డి, మార్కెట్ సూపర్ వైజర్ ఖలీల్, సిబ్బంది సత్యనారాయణ, రామాంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి విద్యార్థులకు సూచించారు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని శ్రీరామనందతీర్థ ఇనిస్టిట్యూట్‌లో గురువారం నిర్వహించిన నిడమనూరు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కలెక్టర్ తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల జ్ఞానాన్ని పరిశీలించారు. గణితం, సైన్స్, సోషల్, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులపై వివిధ రకాల ప్రశ్నలను అడిగారు. సరైన సమాధానాలు చెప్పిన పిల్లలకు చాక్లెట్లను పంపిణీ చేశారు. ఆయా తరగతి గదుల్లో విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎండాకాలంలో విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో జంక్‌ఫుడ్ తినొద్దన్నారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ తక్కిన పరీక్షలను బాగా రాయాలని సూచిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

చిట్యాల: ప్రభుత్వ, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం రాత్రి చిట్యాల (పీహెచ్‌సీ) ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ, ఫార్మసీతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి ద్వారా అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య ఎంత? అందులో గర్భిణులు ఎంత మంది అని సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. కరెంటు సమస్య ఉందని సిబ్బంది చెప్పటంతో వెంటనే స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని కోరారు. కలెక్టర్ వెంట వైద్యాధికారి డాక్టర్ సత్య నరేష్, డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఎంపీవో సత్యనారాయణ ఉన్నారు.

సెర్ప్ లక్ష్యాలను సాధించాలి

- జిల్లా సమాఖ్య భవనాలు పూర్తి చేయాలి
- ఐకేపీ కేంద్రాల బకాయి చెల్లింపులకు చర్యలు
- పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్




మాట్లాడుతున్న లోకేష్

భువనగిరి (కలెక్టరేట్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాలకు పెండింగ్ ఉన్న కమీషన్ చెల్లించేలా చర్యలు తీసుకొని, సెర్ప్ లక్ష్యాలను సాధించాలని పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. నవంబరు వరకు జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. సెర్ప్ కార్యక్రమాల ప్రగతి పనులపై సీఈవో దేవరాజన్ దివ్యతో కలిసి గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.హనుమంతరావు, అదనపు కలెక్టర్(రెవెన్యూ) జీ.వీరారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ మాట్లాడుతూ యాసంగి సీజన్ మార్కెటింగ్‌కోసం సెర్ప్ ఆధ్వర్యంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రస్తుతం 33శాతం ఉన్న కేంద్రాలను 50శాతానికి పెంచాలన్నారు. ఆసక్తి గల మహిళా సంఘాలు రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేసి పంపాలన్నారు. పౌర సరఫరాల శాఖ, సెర్ప్ సమన్వయంతో భారత ఆహారసంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలలను మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి నిర్ణీత సమయంలో అందేలా చూడాలన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటుకోసం ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందస్తుగా జిల్లా స్థాయిలో ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. పెట్రోలు బంకుల తనిఖీలలో లైసెన్సు రద్దు చేసిన వాటిని మహిళా సంఘాలకు కేటాయించాలని, ఇందిరా మహిళా శక్తి బజార్లలో ప్రజలకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టీ.నాగిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, జిల్లా విద్యాశాఖాధికారి కే. సత్యనారాయణ పాల్గొన్నారు.

పంటకు ఊపిరి

- వరద కాల్వకు నీటి విడుదల
- మాడ్గులపల్లి 72 కిలోమీటర్ల వరకు
- యుద్ధ ప్రాతిపదికన అధికారుల చర్యలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



వరద కాల్వకు నీరులేక జీవం కోల్పోతున్న పంటలకు ఊపిరిపోసింది. నాలుగు రోజులుగా నీరు వస్తుండటంతో చివరి దశలో ఉన్న పంటలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. 'ఆంధ్రజ్యోతి' మినీలో ఈ నెల 24న కదిలిస్తే 'కన్నీటి వరద' అనే శీర్షికన రైతుల కష్టాలను ప్రచురించింది. వరద కాల్వకు నీటి సరఫరా చేయడానికి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ (వ్యవసాయం)

6

పదో తరగతి ప్రశ్నపత్రం

లీక్ ఘటన హైకోర్టుకు

- అన్యాయంగా డీబార్ చేశారని విద్యార్థిని వినతి
- ఏప్రిల్ 7న కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు సూచన

7

ఎంజీ యూనివర్సిటీ ప్రాంగణంలో అగ్నిప్రమాదం

- 80ఎకరాల్లో వ్యాపించిన మంటలు
- రెండున్నర గంటల పాటు శ్రమించి మంటలు ఆర్పిన సిబ్బంది



ఎంజీ యూనివర్సిటీ వెనుక భాగంలో దగ్ధమవుతున్న చెట్లు, గడ్డి

నల్లగొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వెనుక భాగంలో గురువారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. యూనివర్సిటీ ప్రాంగణం పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో పత్తి కట్టెకు నిప్పు అంటించగా, గాలి వీచి యూనివర్సిటీ ప్రాంగణంలోని చెట్లు, గడ్డికి అంటుకున్నాయి. దీంతో యూనివర్సిటీ వెనుక భాగంలోని దాదాపు 80ఎకరాల పైచిలుకు ప్రాంతంలో వ్యాపించి అక్కడున్న గడ్డి, కంపచెట్లు, ఇతర చెట్లకు మంటలు అంటుకున్నాయి. మంటల వ్యాప్తిని గమనించిన యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది నల్లగొండ ఫైర్ స్టేషన్, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రాత్రి 8 గంటలకు రంగంలోకి దిగిన పోలీసులు మూడు ఫైరింజన్లను యూనివర్సిటీకి పంపారు. దాదాపు రెండున్నర గంటల పాటు ఫైరింజన్లు, సిబ్బంది శ్రమించి యూనివర్సిటీ ప్రాంగణంలో వ్యాపించిన మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సమయంలో యూనివర్సిటీ హాస్టళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలు అదుపులోకి వచ్చాయని, ఎలాంటి ఇబ్బంది లేదని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు.

నేడు దేవరకొండలో నీటి సరఫరా బంద్

దేవరకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం బాలాజీనగర్ సంప వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు వల్ల శుక్రవారం దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలోని కాలనీలకు తాగునీటి సరఫరా ఉండదని మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతు నిర్వహిస్తున్నామని 29న యథావిధిగా నీటి సరఫరా చేస్తామని పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

చందంపేట తహసీల్దార్ బదిలీ

చందంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చందంపేట తహసీల్దార్ శ్రీనివాస్ పెద్దవూర మండలానికి బదిలీయ్యారు. రెండేళ్లుగా చందంపేట మండల తహసీల్దార్‌గా, నేరేడుగొమ్ము మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తూ భూసమస్యలు, రైతుల సమస్యలు త్వరగా పరిష్కరించేవారు. చందంపేట నాయబ్ తహసీల్దార్ గోవర్ధన్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి

- రూ.1.35 కోట్లు కేటాయించిన కలెక్టర్
- చర్యలు తీసుకుంటున్నట్లు అధికారుల వెల్లడి

ఎండ తీవ్రతకు గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో దేవరకొండ డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య ప్రారంభమైంది. సరిపడా కృష్ణాజలాలు సరఫరా కాకపోవడంతో మారుమూల గ్రామాల ప్రజలు బోరు బావులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది.
(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)


చింతపల్లి మండలం విరాట్‌నగర్‌లో ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు (ఫైల్)

దేవరకొండ డివిజన్‌లో 325 గ్రామపంచాయతీలకు 530 ఆవాసా గ్రామాలు ఉన్నాయి. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ముందస్తుగానే నీటిపారుదలశాఖ, భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఇటీవల సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్ తాగునీటి సమస్య పరిష్కారానికి దేవరకొండ నియోజకవర్గానికి రూ.1.35 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో నూతనంగా బోర్లు వేయడం, బోర్ల మరమ్మతులు, తాగునీటి సమస్య నివారణ చర్యలు చేపడుతున్నారు. దేవరకొండ నియోజకవర్గానికి 31.6 ఎంఎల్‌డీ లీటర్ల నీరు సరఫరా కావాల్సి ఉండగా ప్రస్తుతం 26.7 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతుందని అధికారులు తెలుపుతున్నారు. నాలుగు ఎంఎల్ డీ(40లక్షల లీటర్లు) అదనంగా సరఫరా కావాల్సి ఉంది. దీంతోపాటు డివిజన్‌లోని గ్రామాల్లో పది బావులు, సింగల్ ఫేజ్ మోటార్లు 100, త్రిఫేజ్ మోటార్లు 595, చేతిపంపులు 266 పనిచేస్తున్నాయి. మరో 5 బోరుబావులు నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో లీజుకు తీసుకొని నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఉమ్మడి చందంపేట మండలం కంబాలపల్లి, తెల్‌దేవరపల్లి, బండమీదితండా, చెంచుకాలనీ, పెద్దమూల, యలమలమంద, యాపలబావితండా, చింతపల్లి మండలం కుర్మేడు, గొడుకొండ్ల, మాల్ గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు అధికారులు గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నారు.

చింతపల్లి విరాట్‌నగర్‌లో నీటికోసం ఆందోళన

చింతపల్లి మండలం విరాట్‌నగర్ కాలనీకి మూడు రోజులకు ఒక్కసారి కృష్ణాజలాలు వస్తున్నాయని, అవి కూడ సరిపడా రావడంలేదని దీంతో బోరు బావులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు కాళీ బిందెలతో ఈనెల మొదటివారంలో రోడెక్కి ఆందోళనకు దిగారు. తరచు మిషన్‌భగీరథ పైప్‌లైన్లు పగులుతున్నాయని, మోటార్లు కాలిపోతుండడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వేసవిలో ఇబ్బందులుపడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైప్‌లైన్ ధ్వంసం నీటి సరఫరాకు అంతరాయం

దేవరకొండ నియోజకవర్గానికి మిషన్‌భగీరథ ద్వారా నీరు నసర్లపల్లి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి సరఫరా చేస్తున్నారు. మిషన్‌భగీరథ నీటి సరఫరాలో తరచు అంతరాయం కలుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, పైప్‌లైన్లు పగలుతుండడంతో నీటి సరఫరాకు అంతరా యం కలుగుతుంది. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా రోజు విడిచి రోజువారిగా కృష్ణా జలాలు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోజు విడిచి రోజు కృష్ణాజలాలు సరఫరా చేయాలి

దేవరకొండ పట్టణంతోపాటు గ్రామాలకు రోజు విడిచి రోజు కృష్ణాజలాలు సరఫరా చేయాలి. చందంపేట, పీఏపల్లి మండలాల మారుమూలగ్రామాల్లో సరిపడా కృష్ణాజలాలు రాకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి.

- కంబాలపల్లి ఆనంద్, దేవరకొండ



నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

దేవరకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే జి ల్లా కలెక్టర్ కోటి రూ.35లక్షలతో తాగు నీటి సమస్య పరిష్కారానికి కేటాయించారు. తాగునీటి సమస్య ఉన్న గ్రా మాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతు న్నాం. బోరు బావులు లీజుకు తీసుకొని నీటిని సరఫరా చేస్తాం.

-నగేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

వైభవంగా ఈదమ్మ బోనాలు


తక్కళ్లపల్లిలో బోనాలతో ఈదమ్మఆలయానికి వెళ్తున్న భక్తులు

చింతపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో ఈదమ్మ బోనాలు గురువారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వడ్డెర కులస్థులు పవిత్రంగా బోనాలను ఈదమ్మ దేవతకు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండ్లపల్లి అనితా నర్సిరెడ్డి, నరసింహ, యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సక్రమంగా అందజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అనిల్

తిరుమలగిరి(సాగర్), మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి సరఫరా చేస్తున్న సన్నబియ్యం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలని తహసీల్దార్ అనిల్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల చొప్పున బియ్యం అందిం చాలని అలాగే డీలర్లు సన్నబియ్యం పక్కదారి పట్టకుండా సక్రమంగా అందించాలని, తూకం, తరుగు విషయంలో ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ గోదాముల నుంచే సరఫరా బియ్యంలో తూకంలో ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని తహసీల్దార్‌కు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, ఆర్‌ఐలు లక్ష్మీకాంతం, లక్ష్మీనారాయణ, రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు జటావత్ దత్తు, డీలర్లు హనుమ, మధు, నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

బాల్నెపల్లిలో చలివేంద్రం ప్రారంభం

అడవిదేవులపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాల్నెపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్.నాగేశ్వర్‌రావు గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ఎండ తీవ్రత పెరుగుతున్నందున గ్రామానికి వచ్చి వెళ్లేవారి ప్రజల కోసం, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎ.మౌనిక, బిల్ కలెక్టర్ వి.వాసు, మల్టీ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలలపై చర్య తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అనుమతి లేని అగ్రికల్చర్ కళాశాలలపై చర్య తీసుకోవాలని కోరుతూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐసీఏఆర్‌ఐ) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌సీ. అగర్వాల్‌కు ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు పొందకుండా రాష్ట్రంలో పలు వ్యవసాయ కళాశాలలను నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. ఆయా కళాశాలల్లో వ్యవసాయ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థుల సమయం, డబ్బు వృథా అవుతోందన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

హాలియా,మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన లింగంపల్లి సుశీల జ్ఞాపకార్థంఆమె మనవడు కొప్పోలు జగన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్లను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్టా మధుసూదన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దెల ప్రసాద్, లింగంపల్లి శ్రీనివాస్, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం అందజేత

చింతపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఎస్. రత్నప్రభ వృద్ధాశ్రమ ముఖద్వారానికి రూ.15 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ చైర్మన్ చొల్లేటి శంకరాచారి మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి ఆమె గతంలో తాగునీటి సౌకర్యంతో పాటు మరగుదొడ్ల నిర్వహణకు సంబంధించి పైపులైన్ ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొల్లేటి భాగ్యమ్మ, ట్రస్టు సభ్యులు విజయ్ రెడ్డి, ఇలా సాగరం, మధవి, సిబ్బంది కృష్ణమ్మ పాల్గొన్నారు.

ఐదు లీటర్ల నాటు సారా పట్టివేత

కొండమల్లేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 5 లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం మండల పరిధిలోని చింతచెట్టుతండా నుంచి కొండమల్లేపల్లికి ద్విచక్ర వాహనంపై 5 లీటర్ల నాటు సారాను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం


డిండి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

డిండి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకులు నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా మండలంలోని గ్రామాల్లో గురువారం పర్యటించి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. పేదల కు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్, మురుగు కాలువలు, మరుగుదొడ్లు, సీసీరోడ్ల సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎన్నికలకు ముందు ఆర్భాటంగా పట్టాలు పంపిణీ చేసి తరువాత పూర్తిగా వాటిని విస్మరించారని తెలిపారు. 25 యేళ్లుగా పేదలు సొంత ఇంటి జాగకు నోచుకోలేదని తెలిపారు. తహసీల్దార్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బూషిపాక నిరంజన్, ఎండీ.ఎగ్‌బాల్‌వలీ, బాలయ్య, మహేశ్వరం, జైపాల్, మల్లయ్య, కామేపల్లి జంగయ్య, లాలయ్య పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

మిర్యాలగూడ పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సీపీఎం పట్టణ కార్యదర్శులు మల్లు గౌతం రెడ్డి, భవాండ్ల పాండు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఏర్ప డి 15 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాటలో ఇంటింటికీ తిరిగి అనే క సమస్యలు తెలుసుకున్నట్లు చెప్పారు. వాటి పరిష్కారం కోసం శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలన్నారు. ఆస్తి ఎన్ను చెల్లింపుల్లో ప్రభుత్వం మునిసిపాలిటీలకు 90 శాతం వడ్డీమాఫీ ప్రకటించిందని మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉన్నందున, మరో నెల రోజులు గడువు పెంచాలన్నారు. ఎల్ఆర్‌ఎస్ గందరగోళంగా తయారైందని, వాటిలో నిబంధనలు సక్రమంగా లేవన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆయూబ్, లక్ష్మీనారాయణ, వాడపల్లి రమేష్, బాషా పాల్గొన్నారు.

రేపు డిండి తైబజార్ వేలం

డిండి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): డిండి గ్రామపంచాయతీ తైబజార్ వేలం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి జంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5వేలు ధరావత్ చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు. దరఖాస్తులు ఫారాలు గ్రామపంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

విద్యుత్ కోతలపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి: విద్యుత్ కోతలపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు బాదేపల్లి పులిరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గొడుకొండ్ల(వెంకటేశ్వరనగర్)లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

చందంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్ఎస్ చందంపేట మండల నాయకులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్న సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. అరెస్టయినవారిలో గోసుల శివశంకర్, జబ్బు తిరుపతయ్య, బాల వర్ధిరాజు, జబ్బు శ్రీశైలం ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

పెద్దఅడిశర్లపల్లి,మార్చి27(ఆంధ్రజ్యోతి): రంజాన్‌ను పురస్కరించుకుని మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల మసీదులో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నెర్మటి సతీష్ రెడ్డి ముస్లింలకు గురువారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందులో మండలానికి చెందిన దాదాపుగా 1000 మంది ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో షేక్ వలీ,కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, అక్బర్, ఇబ్రహీం, రహీమ్, జహంగీర్ ఇలీయాస్, షేక్ గాలీబ్, బాబ్‌జాన్, డాక్టర్ రహీమ్ వజీర్ అలీ, రియాజ్, కుశలయ్య, అమరేందర్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు

అర్హులందరికీ జాబ్‌కార్డు అందజేయాలి : అదనపు పీడీ


ఉపాధి హామీ ఓపెన్‌ఫోరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకన్న

డిండి, మార్చి 27(ఆంధ్రజ్యోతి):జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో కూలీగాపనిచేసేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు జారీ చేయాలని అదనపు పీడీ నవీన్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీపైగురువారం ఓపెన్‌ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.5,04,18157 కోట్ల ఉపాధిహామీ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులపై 372 అభ్యంతరాలు సోషల్ ఆడిట్ టీం ఓపెన్‌ఫోరంలో బహిర్గతం చేసినట్లు చెప్పారు. ప్రధానంగా జాబ్‌కార్డు అప్‌డేట్ చేయకపోవడం, పని జరిగే ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పించలేదని బృందం వెల్లడించింది. రైతులు ఉపాధి హామీ పనుల్లో భాగంగా పొలాల్లో ఏరి కుప్పగా పోసిన రాళ్ల సామాజిక తనిఖీ సమయంలో కనిపించకపోవడంతో రైతులే స్వ యంగా తమ అవసరాలకు తరలించుకుపోయినట్లు వెల్లడించారని చెప్పారు. ఏడు గ్రామపంచాయతీల్లో పనికిముందు, పనిచేసిన తరువాత ఫొటోలను ఫీల్డ్ అసిస్టెంట్లు అప్‌లోడ్ చేయలేదని ఆయన తెలిపారు. జేత్యతండా, శక్రుతండా ఎస్ఏలకు రూ.1000 ఫైన్‌వేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ యామిని, ఎంపీడీవో వెంకన్న, జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్ రావు, ఏపీవో రాజు, ఎస్ఆర్‌పీలు వెంకన్న, అశోక్ ఉన్నారు.

మాడ్గులపల్లిలో టోల్‌ప్లాజా భవనం ప్రారంభం


టోల్ ప్లాజా భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి

మాడ్గులపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వద్ద నామ్ ఎక్స్‌ప్రెస్ వే నూతనంగా నిర్మించిన టోల్ ప్లాజా నూతన భవనాన్ని గురువారం ఆర్అండ్‌బీ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి గురుఆర ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైవే సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని, రహదారిపై యాక్సిడెంట్ జోన్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రహదారిపై ఎక్కడైనా మరమ్మతులు చేయాల్సి వస్తే వెంటనే మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో క్యూబ్ వే సీవోవో డాక్టర్ భగవాన్‌రాజు, ఆర్అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈఈ గణేష్, టీఎల్ శ్రీనివాస్‌రావు, కృష్ణారావు, శ్రీకాంత్‌బాబు, ప్రసాద్, ముకేష్, వెంకటేశ్వర్లు, రాము, నరేష్, మల్లేష్, షాదుల్లా, సిబ్బంది ఉన్నారు.

బంజారా భాషను గుర్తించడం హర్షణీయం

మిర్యాలగూడ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బంజారాలు మాట్లాడే గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీ గురువారం ఆమోదించి పార్లమెంట్‌కు పంపడం హర్షణీయమని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 33లక్షల మంది మాట్లాడే బంజారా భాషను గుర్తించి 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీ తీర్మాణం చేయడం చరిత్రాత్మకం అన్నారు. అసెంబ్లీలో తీర్మాణం చేయడంలో కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, బంజారా ఎమ్మె ల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గోర్‌బోలి భాషను గుర్తించి 8వ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదించాలని కోరారు.

కళాకారులను ప్రోత్సహించాలి


కళాకారులను సన్మానిస్తున్న తడకమళ్ల రాంచందర్‌రావు, శివకుమార్, తదితరులు

మిర్యాలగూడ టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రోత్సహించాలని నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తడకమళ్ల రాంచందర్‌రావు అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా పట్టణ కళాకారులను రాష్ట్ర రాజధానిలోని రవీంద్రభారతిలో సన్మానించారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక, కళారంగాభివృద్ధికి అహర్నిషలు కృషి చేయడం గొప్ప విషయమన్నారు. నాట్య, పద్య నాటక సమాజ పునర్‌నిర్మాణానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలన్నారు. సన్మానం పొందిన వారిలో జీఎల్‌కుమార్, గ్యార సాయిలు, రామావతారం తదితరులున్నారు. కార్యక్రమంలో నాటక అకాడమీ మాజీ చైర్మన్ బదిమి శివకుమార్, కృష్ణమూర్తి, శర్మ, బీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

పెద్దవూర, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తరి రాములు పా ల్గొని మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశ నిర్మాతలని, విద్యార్థులు కష్టపడి చదవి తల్లిదండ్రులకు, ఊరికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు కలెక్టర్‌గా, అధికారులుగా, ఉపా ధ్యాయులుగా చక్కగా తమ పాత్రలు పోషించగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.లక్ష్మీప్రభ, ఉపాధ్యాయులు వెంకటరమణ, బ్యులా, చంద్రమౌళి, రాములు, నరేందర్, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఎంఈవో రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాజీ ఉపసర్పంచ్ మృతికి నివాళి

వేములపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ అమిరెడ్డి పద్మ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు వేర్వేరుగా సందర్శించి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు.

పాఠశాలకు డెస్క్‌బెంచీలు అందజేత

వేములపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ మిర్యాలగూడ బ్రాంచీ ఆధ్వర్యంలో రూ.1.50లక్ష విలువగల డెస్క్ బెంచీలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో బీఎం వి. అన్నపూర్ణేష్, హెచ్ఎం నీలం సత్యనారాయణ, ఉపాధ్యాయులు ద్రైద సత్యం, వెంకటరెడ్డి, తిరుపతి, రాజశేఖర్, హేమా, రషీదాబేగం, సుమన్, కుమార్, అఖిల పాల్గొన్నారు.